# సర్వరూప శ్రీనివాసమ్



తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి





# సర్వరూప శ్రీనివాసమ్

రచన

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి
(T.V.R.K.  Murthy, M.Tech)

श्रीं

**శ్రీ డిజైన్స్**

**www.lordofsevenhills.com**

**హైదరాబాదు**
**2010**

# సర్వరూప శ్రీనివాసమ్

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

© సర్వహక్కులు రచయితవి.

ప్రథమ ముద్రణ

**2010**

వెల :

రూ. 20/-

Cover design :
**K.V. Bheema Rao**

కాపీలకు
**"Viswapathi"**
**T.V.R.K. MURTHY, M.Tech**
Flat No. 202, Plot No. 32,
Srikar's Ravi Residency,
Beside Nalanda High School,
Near Motinagar 'X' Roads,
HYDERABAD - 500 018, India.
Ph : 040 - 65885750.
Cell : 98494 43752
Website : www.lordofsevenhills.com
Email : viswapathi@yahoo.com
vediclogos@yahoo.com

Designed & Printed at :
**SRI VASAVI GRAPHICS,**
1A, 1st Floor, Ameepet,
Hyderabad. 9989277178.

# నివేదన

ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన
అంత మాత్రమే నీవు...

అన్నమయ్య చెప్పినట్లుగా శ్రీనివాసుడు సకల దేవతా స్వరూపుడు. ఎవ్వరు ఏ పేరుతో పిలిస్తే ఆ పేరుతో పిలిచే దైవం. ఎవరు ఏ రూపంతో ఆరాధిస్తే ఆ రూపంలో దర్శనమిచ్చే పరబ్రహ్మమూర్తి ఆ శ్రీనివాసుడే. సృష్టి ఆదినుంచి తిరుమలపై కొలువుండి అనేక రూపాలలో దివ్యదర్శనమిస్తూ తనను నమ్మి కొలిచినవారికి సర్వసౌభాగ్యాలు అనుగ్రహిస్తున్న అమృతమూర్తి శ్రీనివాసుడు. శ్రీ స్వామివారి వివిధ రూప తత్త్వాన్నే ఆవిష్కరించే చిన్న ప్రయత్నమే 'ఈ సర్వరూప శ్రీనివాసమ్'.

ఈ సమస్త విశ్వం శ్రీమన్నారాయణుని స్వరూపమే. ఆ శ్రీమన్నారాయణుడే నేడు తిరుమలలో శ్రీనివాసునిగా వెలసి భక్తులందరినీ అనుగ్రహిస్తున్నాడు. ఆ శ్రీనివాసుని దయవలననే నేను ఇంతకుముందు ఎనిమిది పుస్తకాలు రచించడం జరిగింది. ఈ ప్రస్తుత రచన కూడా శ్రీనివాసుని అనుగ్రహమే తప్ప మరొకటి కాదు.

ఆ శ్రీనివాసుని లీలలు అద్భుతం, నమ్మిన వారికి కొంగుబంగారం, అనంతుడు, ఆపద మొక్కులవాడు. తరతరాలుగా స్వామి తనను నమ్మిన వారిని రక్షిస్తూ వారికి ముక్తిని ప్రసాదిస్తున్నాడు.

ఆ శ్రీనివాసునికి తన భక్తులంటే అత్యంత ప్రేమ. మనం అహంకారాన్ని, ఈ ఇహలోక విషయాలపై మమకారాన్ని వదిలి ఆ స్వామిని ప్రార్థిస్తే అన్నీ తనే చూసుకుంటాడు. కలియుగంలో ఇంతకుమించిన దైవం మరొకరు లేరు. ఇందువలననే తిరుమలను రోజూ కొన్ని వేలమంది దర్శిస్తూ, స్వామివారిని సేవిస్తున్నారు.

నా రచనలన్నీ వ్రాసింది నేనైనా నాచే వ్రాయించింది ఆ స్వామివారే... కేవలం కలం మాత్రం నేను పట్టుకున్నాను. అంతే... సాక్షాత్తూ స్వామివారే ప్రతి అక్షరానికి ప్రేరణ, ప్రతీ పదం శ్రీనివాసుని అనుగ్రహమే.

శ్రీనివాసుని లీలలు అద్భుతం, ఆ స్వామిని మనసారా కొలిస్తే అంతటి మహత్తర దేవుడు మరొకరు మనకు కనబడరు. శ్రీ వేంకట తత్వాన్ని అర్థం చేసుకుంటే అంతకు మించిన బ్రహ్మానందం మరొకటి ఉండదు.

ఈ పుస్తకం రచిస్తున్నప్పుడు ఎందరో మహానుభావుల గ్రంథాలు, ఎంతగానో నాకు తోడ్పడ్డాయి. అలాగే ఈ పుస్తక ప్రచురణలో ఎంతోమంది సహకరించారు. వారందరికీ పేరుపేరున నా నమస్కారాలు. అలాగే ఈ గ్రంథ రచన సాదాంతం నా సహధర్మచారిణి చి॥ల॥సౌ॥ శ్రీమతి వేంకట రుక్మిణీ వైదేహి, చిరంజీవులు సురేష్, ఆనంది, ఆముక్త, ఆదిత్య శ్రీనివాస్‌లు ఎంతో సహకరించారు. ఈ పుస్తకాల ప్రచురణలోనూ, అందరికీ చేరటంలోనూ ఎంతో సహాయ సహకారాలందిస్తున్న శ్రీమతి & శ్రీ ఎల్లాప్రగడ రమణమూర్తి, శ్రీమతి & శ్రీ ఎల్లాప్రగడ శ్రీనివాస మూర్తి దంపతులకు ఎంతో కృతజ్ఞుడ్ని. వీరికీ, ఈ పుస్తకాన్ని, కవర్ చిత్రాలను ఎంతో అందంగా డి.టి.పి. చేసిన శ్రీ వాసవీ గ్రాఫిక్స్, శ్రీమతి & శ్రీ పి.జగదీష్‌కు శ్రీలక్ష్మీశ్రీనివాసుల అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

ఇంతటి భాగ్యాన్ని ఇచ్చిన ఆ పరబ్రహ్మ మూర్తికి ఇవే నా ప్రణామములు. ఎల్లప్పుడూ ఆ శ్రీవారి సేవలోనే గడుపుతాననీ, శ్రీ వేంకట తత్వాన్ని ప్రజలందరి హృదయాలకు చేరువగా తీసుకువెళ్లడమే నా జీవిత గమ్యం అని ఆ స్వామివారికి విన్నవించు కుంటున్నాను.

ఈ పుస్తక రచనకు ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ సహకరించిన ప్రతి ఒక్కరికి సకల ఆయురారోగ్య సౌభాగ్యాలు కలగాలని ఆ శ్రీలక్ష్మీ శ్రీనివాసులను ప్రార్థిస్తున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు ః

శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళం

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

హైదరాబాద్.

# సర్వరూప శ్రీనివాసా !

వైకుంఠంలో శ్రీమన్నారాయణులవారు ఆదిశేషునిపై పవళించి వుండగా జగన్మాత శ్రీ మహాలక్ష్మి స్వామివారి పాదాలను ఒత్తుతూ సపర్యలు చేస్తున్నది. శ్రీ స్వామివారు కనులు మూసుకుని పెదవులపై చిరు మందహాసంతో దర్శనమిస్తున్నారు. ఆ చిరునవ్వే కదా సమస్త విశ్వానికి రక్షా కవచంగా నిలిచేది! ఆ చిరుమందహాసమే కదా సమస్త భక్త జనకోటిని ఆనందంలో ముంచెత్తేది. సమస్త విశ్వాన్ని సమ్మోహనంలో పడవేసేది కూడా ఆ చిరుమందహాసమే! స్వామిని తదేకగా చూస్తున్న జగన్మాతకు శ్రీవారు ఏదో ఆలోచనలో వుండినట్లుగా తోచినది. సమస్త జీవులలో హృదయాలలో అంతర్యామి స్వరూపంలో వుండే శ్రీ స్వామివారి హృదయంలో ఆలోచన ఏమై వుంటుందా అని తలుస్తున్నది.

ఇంతలో ద్వారపాలకుడైన జయుడు వచ్చి నిలుచున్నాడు. స్వామివారు ఏదో దీర్ఘాలోచనలో వున్నారని గ్రహించి చేతులు కట్టుకుని,

వినయంగా నించుని వున్నాడు. కొద్దిసేపటికి జయుని రాకను గ్రహించిన శ్రీమన్నారాయణులవారు కనులు తెరిచి జయునివంక చూశాడు. అప్పుడు జయుడు శ్రీ స్వామివారితో 'స్వామీ! శ్రీమన్నారాయణా! నీకివే నా నమస్కారములు. నీ దర్శనార్థమై ఇంద్రాది అష్ట దిక్పాలకులు, ఆదిత్యాది నవగ్రహ దేవతలు వచ్చి వున్నారు. వారిని చూచినచో ఏదో ముఖ్య విషయమై తమరితో సంప్రదించుటకు వచ్చినట్లుగా తోచుచున్నది. తమరి అనుజ్ఞకై ద్వారము దగ్గర వేచియున్నారు ప్రభూ! అని అన్నాడు. అప్పుడు శ్రీమహావిష్ణువు జయునితో 'ప్రియభక్తా! ఇంద్రాది అష్ట దిక్పాలకులు, ఆదిత్యాది నవగ్రహ దేవతలు అందరూ కలిసి వచ్చినారంటే ఏదో విశేషమే వుండి వుంటుంది. వారిని తప్పక లోనికి తీసుకురావలసింది' అని అన్నాడు.

శ్రీమన్నారాయణుని అనుజ్ఞ తీసుకుని వచ్చిన జయుడు స్వామి దర్శనానికై నిరీక్షిస్తున్న దేవతలతో శ్రీ స్వామివారు వారిని లోనికి రమ్మనమనెనని చెప్పినాడు. అప్పుడు వారందరూ శ్రీమన్నారాయణుని సముఖానికి వచ్చారు. ఇంద్రుడు శ్రీ స్వామి వారితో 'ఓ శ్రీమన్నారాయణా! జగన్నాథా! సమస్త విశ్వానికీ రక్షకుడవైన నీకు మా అందరి నమస్కారములు. నీకు జయమగుగాక. ఈ విశ్వమంతయూ వ్యాపించి యున్న నీకివే మా ప్రణామములు. నీ అనుగ్రహం వలననే సమస్త ప్రాణికోటి సుఖముగా నున్నారు. మా దేవతలందరి శక్తి నీ అనుగ్రహమే కదా అని అన్నాడు.

అప్పుడు శ్రీమన్నారాయణులవారు వారందరినీ ఉద్దేశించి ఇలా అన్నాడు. ఓ ఇంద్రా! ఏమిటి విశేషం? అష్టదిక్పాలకులైన మీరందరూ కలిసిరావటంలో ఏదో విశేషమే వుండి వుంటుంది. మీరే కాక మీతోపాటు ఆదిత్యాది నవగ్రహ దేవతలు కూడా రావటం ఇంకా విశేషముగా తోచుచున్నది. మీరందరూ కుశలమే కదా! మీ మీ లోకాలలోని వారందరూ క్షేమమే కదా! మీరు వచ్చిన కారణమేమిటో వివరింపవలసింది అని అన్నాడు. అప్పుడు ఇంద్రుడు శ్రీ స్వామివారికి నమస్కరించి ఇలా అన్నాడు.

'స్వామీ! జగన్నాథా! ఆర్తజనరక్షకా నీకివే మా నమస్కారములు. నీ అనుగ్రహం వలన మేమును, మా లోకమున వాసులునూ అందరూ కుశలమే. సమస్త ప్రాణికోటిని నీ హృదయంలో నింపుకుని చల్లగా చూచే కరుణామయునివి నీవుండగా ఎవ్వరికీ ఎటువంటీ లోటు లేదు తండ్రీ! అందరమూ సుఖ సంతోషాలతో వున్నాము. ఎవరికినీ ఎటువంటి బాధలును లేవు. అలాగే అన్ని లోకములలోని యక్ష, కిన్నెర, కింపురుషులు సమస్త మునిగణమూ కూడా తమరి అనుగ్రహంతో సంతోషముగా నున్నారు అని అన్నాడు.

ఇంకా మాట్లాడుతూ ఇలా అన్నాడు. 'స్వామీ! ఒక విన్నపము. భూలోకంలో మాత్రమే మానవులు పూర్వజన్మ కర్మల ఫలితంగా అనేక బాధలు పడుతున్నారు. ఎన్నో కష్టములను అనుభవిస్తున్నారు. సంసార సాగరాన్ని ఈదలేక సతమతమవుతున్నారు. అనేక ఆర్థిక, శారీరక, మానసిక అనారోగ్య సమస్యలకు లోనౌతున్నారు. వీరిలో కొందరికి వారి పూర్వజన్మ కర్మఫలం చిన్న వయస్సులోనే అనుభవానికి వచ్చుటచే వారును, వారి తల్లిదండ్రులును, ఎన్నో కష్టాలకు లోనౌతున్నారు. మధ్య వయస్సులో కర్మఫలం అనుభవిస్తున్నవారు అనేక ఉద్యోగ, మానసిక సమస్యలకు లోనై సంసారమును సుఖంగా సాగించలేకపోతున్నారు. జీవితమంతా సుఖంగా జరిగినను వార్ధక్యంలో తమ పూర్వజన్మ కర్మఫలం అనుభవానికి వచ్చినవారు, ఆ కారణంచేత అనేక అనారోగ్యములకై లోనై వారు కష్టపడి, వారి కుమారులు, కుమార్తెలకు ఎంతో బరువుగా తోచుచున్నారు. వీరిలో కొందరు ఈ జన్మలో ఎన్నో పుణ్యకార్యములను ఒనరించుచూ, ధర్మపథములో జీవించుచున్నప్పటికీ వారి పూర్వజన్మ కర్మఫలంచే అనేక బాధలను పడుచున్నారు. వారిని చూచిన మాకందరికీ ఎంతో బాధ కలుగుతున్నది. వీరందరినీ ఈ సమస్యనుంచి, బాధలనుంచి విముక్తి కలిగి సంతోషంగా జీవించే మార్గం ఏదైనా అనుగ్రహింపవలసినది అని వేడుకున్నాడు.

అప్పుడు కరుణామయుడైన శ్రీమన్నారాయణుడు వారితో ఇలా అన్నాడు. 'ఓ అష్ట దిక్పాలకులారా! నవగ్రహదేవతలారా! మీరు చెప్పినది సత్యం. మీరు చెప్పినట్లుగా భూలోకంలోని మానవులు తమ తమ పూర్వజన్మ కర్మఫలితంచే అనేక బాధలను అనుభవిస్తున్నారు. నా బిడ్డలైన వారిని చూచిన నాకునూ బాధ కలుగుచున్నది. వారందరి సమస్యలు తక్షణమే నివారణ చేయగల ఏకైక మార్గం చెప్తాను వినండి!' అని ఈవిధంగా చెప్పసాగాడు. 'ఓ దేవతలారా! భూలోకంలో సువర్ణముఖీ నదీ తీరమున మూడు యోజనముల విస్తీర్ణము, ముప్పది యోజనముల పొడవు గల వేంకటాద్రి అనే పర్వతరాజము కలదు. ఆ పర్వతము మహా మహి మాన్వితమైనది. కేవలం స్మరణ మాత్రముననే అనేక శుభ ఫలములను ఇచ్చునది. ఆ క్షేత్ర దర్శనముచే సర్వ పాపములు నశించును. ఎన్ని జన్మములలో నొనరించిన ఎంతటి పాపములైననూ ఆ క్షేత్రములో కాలిడినంతనే తక్షణము ఆహుతి అగును. భూలోక వాసులు తమ పాప పరిహారమును ఈ క్షేత్ర దర్శనమే చక్కని ఉపాయము' అని సెలవిచ్చెను.

అప్పుడు ఇంద్రుడు స్వామివారితో 'స్వామీ! శ్రీమన్నారాయణా! ఇది చాలా ఆశ్చర్యముగానున్నదే. ఆ వేంకటాద్రి అంతటి మహిమాన్వితమైనదా. ఎన్నో జన్మల పాపాలు క్షణంలో నశించే అద్భుత శక్తి ఆ క్షేత్రమునకు ఏల కలిగినది? అని అడిగాడు. అప్పుడు శ్రీ స్వామివారు అక్కడ వున్న దేవతలందరిని ఉద్ధేశించి ఇలా అన్నాడు. 'ఓ దేవతలారా! మీ సంశయము నాకు అర్థమైనది. కేవలము దర్శనమాత్రముననే సర్వపాపాలనూ హరించే ఆ క్షేత్రము గురించి మీరే తెలుసుకొనండి. అప్పుడు మీకు అన్ని విషయాలు విశదంగా అర్థం కాగలవు. ఆ క్షేత్రమును స్వయంగా దర్శిస్తే కానీ ఆ క్షేత్ర విశిష్టత తెలియదు. మీరే స్వయంగా వెళ్ళి ఆ క్షేత్రమును దర్శించండి. రేపటి నుంచి ఒక్కొక్కరోజు మీలో ఒకరి తరువాత ఒకరు భూలోకం వెళ్ళి సువర్ణముఖీ నదీ తీరమునగల వేంకటాద్రిని దర్శించి అక్కడ కొలువై వున్న

దేవుడెవరో మీరే గ్రహించండి. ఈ విధంగా మీరందరూ దర్శించిన తరువాత అందరూ కలిసి నా వద్దకు వచ్చి మీరు గాంచిన విశేషాలను నాకు విన్నవించవలసింది. అప్పుడు మీకు ఆ క్షేత్ర మహాత్త్యము పూర్తిగా అర్థం కాగలదు. ఇంద్రా! నీవు రేపే వెళ్ళవలసింది. మరునాడు వరుణుడు వెళ్ళగలడు. అటు తరువాత యముడును, పిమ్మట అగ్నియును ఈ విధముగా మీరందరూ ఒకరి తరువాత ఒకరు వెళ్ళి ఆ క్షేత్రమును దర్శింపవలసింది' అని శెలవిచ్చాడు. అప్పుడు దేవతలందరూ స్వామివారికి నమస్కరించి ఆ విధముగానే చేసెదమని చెప్పి స్వామివద్ద శెలవు తీసుకుని తమ తమ నిజ స్థానములకు వెడలిపోయారు.

శ్రీమన్నారాయణులవారు చెప్పిన ఆలయం దర్శించాలని వివరాలు అన్నీ తెలుసుకోవాలనీ ఇంద్రుడికి ఎంతో ఆత్రుత కలిగింది. స్వామి ఆదేశించినట్లుగానే ఆ మరునాడే భూలోకానికి పయనమైనాడు. భూలోకం చేరిన ఇంద్రుడు సువర్ణముఖీ నదీ తీరంలోని వేంకటాద్రి పర్వత సమీపానికి చేరుకున్నాడు. అంత దూరం నుంచి ఆ పర్వతాన్ని చూడగానే ఇంద్రుని కళ్ళు చెదిరిపోయాయి. బంగారు కాంతులతో మెరిసిపోతున్నది ఆ పర్వతం. అంతటి అద్భుత ప్రకాశవంతమైన వేంకటాద్రిని చూచిన ఇంద్రునికి అసలు ఇది పర్వతమేనా లేక ఏదైనా దివ్యశక్తి ఆ రూపంలో వున్నదా అని తోచింది. ఆహా! ఎంత అద్భుతం ఈ పర్వతంపై కొలవున్న ఆ దేవత సామాన్యుడో లేక సామాన్యురాలో వుండటానికి వీల్లేదు. ఇంత అద్భుత తేజస్సుతో దేవతలమైన మా కంటికి కూడా చూడశక్యం కాలేకపోతున్నామంటే తప్పక ఈ పర్వతం మహా మహిమాన్వితమై వుంటుంది.

ఆ విధంగా తలుస్తూ వేంకటాద్రి దగ్గరకు వచ్చిన ఇంద్రుడు ఆ పర్వతంపై కాలు పెట్టగానే శరీరమంతా ఏదో శక్తి ఆవహించినట్లయింది. ఏమిటీ విచిత్రం? ఈ పర్వత రాజంపై కాలుపెట్టగానే తనకు ఏల ఇంత దివ్యానుభూతి కలుగుతున్నది అని తలుస్తూ చుట్టూ చూడగా

కొండనెక్కుతున్న ఎందరో భక్తులు కనబడ్డారు. వారందరూ చిత్ర విచిత్ర వేషధారణలలో వున్నారు. వీరిలో స్త్రీలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఇలా అందరూ వున్నారు. ఏదో పాటలు పాడుకుంటూ, భజనలు చేస్తూ కొండనెక్కుతున్నారు. వారి భాష అర్థం కావట్లేదు కానీ, వారు మాత్రం ఆ కొండపై వున్న దేవతను గురించే ప్రశంసిస్తూ వెళుతున్నట్లు వారి ముఖాలలోని ఆనందం స్పష్టంగా తెలియపరుస్తున్నది. ఒళ్లు మరచి ఎంతో శ్రావ్యంగా గీతాలను ఆలపిస్తూ ఏమాత్రం శ్రమ తెలియకుండా ఆ భక్తులందరూ ఆడుతూ పాడుతూ కొండనెక్కుతున్నారు.

అలా వారందరితో కలిసి ఇంద్రుడు కొండనెక్కాడు. కొండపై కొలువున్న దేవత ఎవరై వుంటుంది? సృష్టికర్త ఆ చతుర్ముఖ బ్రహ్మ కాదు కదా? లేక సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడేనా లేక పరమేశ్వరుడా లేక త్రిశక్తులలో ఎవరైనా ఒకరు ఇక్కడ అవతరించినారా? ఇలా ఆలోచిస్తూ ఆ కొండపై వున్న పుష్కరణిలో భక్తులతో కలిసి స్నానమాచరించాడు. ఇంద్రుడు దివ్య రూపంలో వుండటంచేత భక్తులెవరికీ కనిపించట్లేదు. స్నానం చేసిన ఇంద్రునికి శరీరమంతా శక్తి ద్విగుణీకృతమైనట్లు తోచింది. అటు తరువాత వారందరితో కలిసి ఆలయంలోనికి వెళ్ళాడు. శ్రీమన్నారాయణుడు చెప్పిన దేవత ఎవరు? ఎవరిని దర్శిస్తే ఆ మానవుల సర్వపాపాలూ క్షణంలో తొలగిపోతాయి. ఏ దేవత దర్శనంచే సమస్త మానవ కోటి దుఖం పరిహారమవ్వగలదు ఇలా తలుస్తూ గర్భాలయం వద్దకు చేరుకున్నాడు ఇంద్రుడు.

ఒక్కసారి కనులు మూసుకుని శ్రీమన్నారాయణుని ప్రార్థించి, తిరిగి కనులు తెరిచి ఎదురుగా గర్భాలయంలోని మూర్తిని చూశాడు. అంతే ఆ దివ్య మంగళ మూర్తిని చూసిన ఇంద్రుని ఆశ్చర్యానికి అంతు లేదు. అక్కడ వున్నది సాక్షాత్తూ జగన్మాత! శక్తి స్వరూపిణి, జగజ్జనిని దుర్గమ్మ తల్లియే! ఆహా! ఎంత దివ్య మంగళ స్వరూపం! తల్లీ! నీకివే నా నమస్కారములు.

ఓ పరమేశ్వరీ! నీకివే నా మంగళా శాసనములు. పరబ్రహ్మ స్వరూపిణివి, సర్వశక్తి స్వరూపిణివి, బ్రహ్మ విద్యా స్వరూపిణివి, అమృతమయివి, కరుణామయివి, ఆనందమయివి నీవే తల్లి. సర్వసృష్టికీ మూలాధారం నీవే తల్లీ!' అని ఆ జగన్మాతను ఇంద్రుడు అనేక విధాల స్తుతించాడు. ఆ తల్లి దివ్యమంగళ మనోహర విగ్రహాన్ని చూసిన ఇంద్రుడు ఎంతో ఆనందించాడు.

ఆహా! ఇక్కడ కొలువున్నది పరమేశ్వరి అన్నమాట. అందుకనే ఈ తల్లి దర్శనంతో సమస్త మానవకోటికి జన్మల జన్మల పాపాలూ క్షణంలో నశిస్తున్నాయి. త్రిశక్తులలో ఒకటైన ఈ తల్లి ఇక్కడ కొలువుండి భక్తులను అనుగ్రహిస్తున్నది. సాక్షాత్తూ శక్తి స్వరూపిణి, సృష్టికి మూలాధారమైన పరమేశ్వరియే ఈ వేంకటాద్రిపై కొలువుండటంతో ఈ పర్వతానికి ఇంతటి శక్తి వచ్చింది అని తలిచాడు. ఆ విధంగా శ్రీమన్నారాయాణులవారి ఆదేశం ప్రకారం వేంకటాద్రి దర్శించిన ఇంద్రుడు అక్కడ కొలువై వున్నది పరమేశ్వరిగా గ్రహించి తిరిగి తన లోకానికి వెళ్లిపోయాడు.

ఇంద్రుడు వెళ్లిన మరునాడే శ్రీ స్వామివారి ఆదేశం ప్రకారం వరుణుడు వేంకటాద్రి దర్శనార్థమై భూలోకానికి పయనమైనాడు. సమస్త మానవకోటికి పుణ్యస్థలమైన ఈ వేంకటాద్రి ఎలా వుంటుంది? అక్కడ వున్న దేవుడు ఎవరై వుంటాడు? ఏ దేవత దర్శనంచే ఈ మానవులందరూ పునీతు లౌతున్నారు? ఏ శక్తి ఈ మానవులందరి పూర్వజన్మ పాపములను దర్శనమాత్రముననే క్షణంలో హరించివేస్తున్నది? అని తలుస్తూ వరుణుడు వేంకటాద్రి సమీపానికి చేరాడు.

భక్తులతో కలిసి కొండనెక్కుతూ ఎంతో దివ్యానుభూతులకు లోనౌతున్నాడు వరుణ దేవుడు. ఆహా! ఏమిటీ దివ్యశక్తి. పూర్తిగా కనకరూపమై కొన్ని కోట్ల సూర్యుల తేజస్సుతో వెలుగుతున్నది కదా ఈ వేంకటాద్రి! ఆహా! ఇంతటి దివ్యమైన పర్వతాన్ని తమ చెంతనే కలిగిన ఈ

భూలోక వాసులు ఎంతటి అదృష్టవంతులో కదా! అని తలుస్తూ కొండనెక్కసాగాడు. దివ్య రూపంలో కొండనెక్కుతున్న వరుణుడు ఎవరికీ కనిపించటలేదు. ఈ కొండపై అడుగిడగానే భక్తుల పాపాలు తక్షణమే నశించటం తాను కళ్ళారా చూశాడు. అవిటి తనంతో వున్నవారికి కొండ మొదటి మెట్టు తగలగానే ఆ అవిటితనం పోయి మామూలు నడక రావటం గమనించాడు. కుష్టు వ్యాధితో బాధపడుతున్న మరొక భక్తుడు కేవలం ఇరవై మెట్లు ఎక్కగానే వ్యాధి పూర్తిగా నయమై సంపూర్ణ ఆరోగ్యవంతు డయ్యాడు. తీవ్రమైన పుండుతో బాధ పడుతున్న మరొక భక్తుడు నలభై మెట్లు ఎక్కగానే ఆ పుండు పూర్తిగా మాయమై ఎంతో శక్తివంతుడవటం గ్రహించాడు.

ఆహా! ఇన్ని అద్భుతాలు కేవలం ఈ కొండనెక్కుట వలనే జరుగుతున్నవంటే ఈ కొండ సామాన్యమైనది కాదు సుమా! ఇంతటి దివ్య పర్వత రాజముపై కొలువున్న దేవుడు సామాన్య శక్తి కాబోదు సుమా! అని తలచాడు. ప్రతి మెట్టుకూ దివ్యానుభూతులు కలుగుతున్న ఈ పర్వత రాజంపై అలరారుతున్న పరమాత్మ ఎవరై వుంటారా అని వరుణ దేవునిలో ఆతృత పెరిగింది. ఈ మానవులు గమనించుట లేదు కానీ వారు ఒక్కొక్క మెట్టుపై కాలు పెట్టగానే ప్రతి మెట్టుకీ వేయి జన్మల పాపాలు నశిస్తున్నాయి. ఆహా! ఇంతటి మహిమాన్వితమైన పర్వతరాజాన్ని తాను ఇంతకుముందెన్నడూ గాంచలేదే? కనీసం ఇటువంటిది ఒకటి భూలోకంలో వున్నదని కూడా తెలుసుకొనలేదే? అని ఆశ్చర్యపోతూ కొండనెక్కాడు.

భక్తులతో కలిసి దేవాలయం పక్కనేవున్న పుష్కరిణిలో స్నానమాచరించి ఆలయంలోనికి ప్రవేశించాడు. ఒక్కొక్క గడపా దాటుతున్నాడు. ఇంతలో ఒక అద్భుత దృశ్యం గమనించాడు వరుణుడు. ఒక దివ్య సర్పం ఎంతో తేజస్సుతో వెలిగిపోతూ చర చరా పాకుతూ గర్భాలయం వైపు వెళ్ళసాగింది. ఆహా! ఎంత దివ్యంగా ప్రకాశిస్తున్నది! ఈ సర్పరాజం సాక్షాత్తూ ఆదిశేషుడు

కాదు కదా! అని తలచాడు. దివ్య తేజస్సుతో మెరుస్తున్న ఆ సర్పం సామాన్య మానవులకు కనిపించుట లేదు. వరుణుడు ఈ సర్పాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఆలయంలో వున్న మూర్తిని తనలాగే దర్శించడానికి ఎంతో ఆత్రంగా వెళుతున్నట్టు వరుణుకి తోచింది. ఇలా ఆలోచిస్తూ వరుణుడు గర్భాలయంలోనికి ప్రవేశించాడు.

గర్భాలయానికి చేరిన వరుణుడు ఒకసారి కనులు మూసుకుని మనస్సులో శ్రీమన్నారాయణుని ప్రార్థించాడు. స్వామీ! జగద్రక్షకా, జగన్నాథా నీవు చెప్పిన ఈ మూర్తిని ఇంకో క్షణంలో దర్శించకొనబోతున్నాను. ఆ దేవుని దివ్య దర్శనం నాకు అనుగ్రహింప వలసింది అని ప్రార్థిస్తూ కనులు తెరిచాడు. ఆ విధంగా కనులు తెరిచిన వరుణునికి ఎదురుగా దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న మనోహర మూర్తి దర్శనమిచ్చాడు. ఆ తేజస్సును తట్టుకోలేక వరుణ దేవుని కనులు ఒక్కసారి మూతబడ్డాయి. శ్రీమన్నారాయణుని మనసులో ప్రార్థించి తిరిగి కనులు తెరిచాడు. ఎదురుగా దివ్య మంగళ రూపంలో దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్న కార్తికేయుడు దర్శనమిచ్చాడు. వెంటనే రెండు చేతులు జోడించి ఆ స్వామికి నమస్కరిస్తూ స్వామీ! భక్త జనరక్షకా, శక్తిధరా, ఉమాసుతా, నీకివే నా నమస్కారములు, నీకు మంగళమగుగాక. ఆరు ఋతువులు, ఆరు ముఖములుగా కలిగిన షణ్ముఖా నీకిదే నా నమస్కారము. పన్నెండు మాసాలూ, పన్నెండు చేతులుగా కలిగిన కార్తికేయా నీకిదే నా ప్రణామములు. ఉత్తర, దక్షిణాయనములే పాదాలుగా కలిగిన కాలస్వరూపా! సుబ్రహ్మణ్యేశ్వరా నీకివే నా నమస్కారములు అని స్వామిని అనేక విధాలా స్తుతించాడు. ఆహా! ఎంత దివ్యంగా నున్నది నీ రూపం! నీ దర్శన భాగ్యంచేత ఈ మానవులందరూ పునీతులౌతున్నారు. జన్మ జన్మల పాపములు నీ దర్శనమాత్రముననే నశిస్తున్నాయి తండ్రీ. పరమపురుషుడవైన ఉమాసుతా! నీకివే నా

నమస్కారములు అని ఎన్నో రకాల ప్రార్థించి ఆలయం వెలుపలకు వచ్చి తిరిగి తన లోకానికి పయనమైనాడు.

వరుణదేవుడు వెళ్ళిన కొన్ని రోజులకు యమదర్మరాజు శ్రీమన్నారాయణుని ఆదేశం ప్రకారం వేంకటాద్రి దర్శనార్థమై భూలోకానికి బయలుదేరాడు. స్వామివారు చెప్పిన ఆ దివ్య క్షేత్రం ఏవిధంగా వుండి వుంటుంది? అక్కడ దేవుడు ఎవరై వుండి వుంటాడు? చతుర్ముఖ బ్రహ్మయా? శ్రీ మహావిష్ణువా? లేక సాక్షాత్ పరమేశ్వరుడా? ఏ దేవుని దర్శనం మాత్రముననే మానవుని సర్వ పాపాలూ నశిస్తున్నవో ఆ దేవుడెవరు? ఈ వేంకటాద్రి దివ్య క్షేత్రంపై నిత్య పూజలందుకుంటున్న ఆ స్వామి ఎవరు? ఇక్కడ స్వామి దర్శనంచేత మానవుల కోటి జన్మల పాపాలన్నీ పరిహారమౌతాయని సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే శెలవిచ్చాడు కదా. ఆ స్వామియే చెప్పిన ఈ క్షేత్రం సామాన్యమైనది కాజాలదు. అని తలస్తూ వేంకటాద్రి సమీపానికి చేరాడు.

వేంకటాద్రిని సమీపించిన యముడు శ్రీమన్నారాయణునే మనస్సులో తలస్తూ ఒక్కొక్క మెట్టూ ఎక్కసాగాడు. ఎందరో భక్తులు పాటలు పాడుకుంటూ కొండనెక్కడం గమనించాడు. వారి ముఖములన్నీ ఎంతో సంతోషంతో వెలిగిపోతుండటం చూశాడు. కొండనెక్కి తాము దర్శించబోయే స్వామి గురించే వారందరూ ముచ్చట్లు చెప్పుకుంటున్నట్లుగా గ్రహించాడు. ఆహా! పైన కొండపైనున్న దేవుడెవరో కానీ చాలా మహిమాన్వితుడై వుండి వుండాలి. లేకపోతే ఇంతమంది భక్తులు, అదీ చిన్నపిల్లలు, ఆడవారు, వృద్ధులు సైతం ఈ కొండను వారి ముఖాలలో ఏ మాత్రం అలసట కనిపించకుండా ఎక్క గలుగుతున్నారంటే ఇది సామాన్య విషయం కాబోదు సుమా అని తలచాడు. ఈవిధంగా కొండనెక్కుతున్న యమునికి దారికి ఇరుపక్కలా కొన్ని కోట్ల సంవత్సరాలుగా తపస్సు చేస్తూ వృక్ష రూపాలలో వున్న మునీశ్వరులు దర్శనమిచ్చారు. ఆహా! ఏమి ఈ అద్భుత దృశ్యం

అని తలుస్తూ ముందుకు సాగిన యమధర్మరాజుకు మరొక విచిత్రం గమనించాడు. కొండనెక్కుతున్న మానవులలో కొందరు అకాల మృత్యువునుంచి బయటపడినవారిగా గమనించాడు. ఓహో! వీరందరూ కొండపైనున్న స్వామిని వేడడంతో తన బారి నుండి కూడా తప్పించు కోగలిగారన్నమాట! ఆహా! ఇంతటి శక్తి గల ఈ స్వామి సాక్షాత్తూ పరబ్రహ్మమూర్తియే కావచ్చును లేకపోతే తననుంచి కూడా ఎటువంటి ఆపదా కలగకుండా ఈ భక్తులు తప్పించుకున్నారంటే అది సామాన్య విషయం కాదు కదా! మృత్యు దేవత స్వరూపమైన నన్ను కూడా శాసించగల దేవుడెవరై వుంటాడు అని తలుస్తూ కొండపైకి చేరాడు యమధర్మరాజు.

కొండనెక్కిన యమధర్మరాజు మిగిలిన భక్తులతో కలిసి ఆలయంలోనికి వెళ్లాడు. శ్రీమన్నారాయణుని ప్రార్థిస్తూ గర్భాలయానికి చేరి ఒక్కసారి కనులు మూసి తెరిచాడు. అంతే అక్కడ ఎదురుగా వున్న మూర్తిని చూసి ఆశ్చర్యపోయాడు. యమునికి అక్కడ దర్శనమిచ్చినది సర్వమంగళ స్వరూపిణి, సర్వ ఐశ్వర్య ప్రదాయిని, సర్వ బుద్ధి ప్రదాయిని అయిన జగన్మాత శ్రీ మహాలక్ష్మి. ఆ తల్లిని చూడగానే యమధర్మరాజు చేతులు ఒక్కసారిగా జోడించి నమస్కరించాడు. తల్లీ! జగన్మాతా! జగజ్జననీ! నీకివే నా నమస్కారములు. ఈ సృష్టిలోని సమస్త మంగళ స్వరూపములన్నీ నీవే కదా తల్లీ! లక్ష్మీ, తులసీ, రుక్మిణీ, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, సంతానలక్ష్మి, విజయలక్ష్మి, విద్యాలక్ష్మి, ధైర్యలక్ష్మి, శ్రీరంగ నాయకి, శ్రీ నారాయణి నమోస్తుతే! సర్వ ఐశ్వర్యములకై నిలయం నీవే తల్లీ! సర్వ లోక సంరక్షణివి నీవే! నీవే సర్వ వశంకరివి! భక్తజన కల్పవల్లివి నీవే తల్లి! నీ దర్శన భాగ్యంచే ఈ సమస్త మానవకోటి పునీతులౌతున్నారు అనేక విధాల స్తుతించాడు.

గర్భాలయంలో దివ్య మంగళ స్వరూపంతో, కోటి సూర్యుల తేజస్సుతో, అద్భుత సౌందర్యంతో ప్రకాశిస్తున్న జగన్మాతను

చూసిన యమధర్మరాజు ఎంతో సంతోషానికి లోనైనాడు. ఆహా! శ్రీమన్నారాయణుడు చెప్పిన ఇక్కడ కొలువై వున్న దేవత సాక్షాత్తూ ఆ స్వామి పట్టమహిషి అయిన శ్రీ మహాలక్ష్మీ దర్శనమీయడం ఆశ్చర్యం కలిగించింది, భూమండలంలో మానవులు ఏ జన్మలో చేసిన పాపాలైనా క్షణంలో పటాపంచలం కాగల దివ్యక్షేత్రం, ఈ వేంకటాద్రి కదా అని తలచాడు. ఇక్కడ కొలువున్న దేవత ఎవరై వుంటారా అని తలస్తూ ఆతృతతో వచ్చిన యమునికి సాక్షాత్తూ ఆ క్షీరాబ్ధికన్యకయే మూలమూర్తిగా దర్శనమివ్వటం ఎంతో ఆనందం కలిగించింది. ఆ తల్లికి నమస్కరించి ఎన్నో విధాల స్తుతించి తనలోకానికి పయనమైనాడు యముడు.

ఆవిధంగా యముడు వెళ్లిన కొన్నిరోజులకు అగ్ని దేవుడు భూలోకానికి వేంకటాద్రి దర్శనార్థనమై పయనమైనాడు. శ్రీమన్నారాయణుడు చెప్పిన వేంకటాద్రి విశిష్టత తెలుసుకోవాలని అక్కడ వున్న దైవం ఎవరైనది తెలుసుకోవాలనే సంకల్పంతో భూలోకం చేరి సువర్ణముఖీ నదీ తీరం చేరుకున్నాడు. అక్కడ నుంచి ముందుకు నడుస్తుండగా కొద్ది దూరంలో దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్న ఒక కొండ కనిపించింది. పూర్తిగా స్వర్ణమయమై అద్భుత తేజస్సుతో వెలిగిపోతున్న ఆ పర్వత రాజం తప్పక వేంకటాద్రియే అయి వుంటుందని అగ్నిదేవునికి తోచింది. దగ్గరకు వచ్చి పాదం మోపగానే ఒక్కసారిగా అగ్ని దేవునికి శరీరమంతా ఏదో తెలియని అనిర్వచనీయమైన, వర్ణించ వీలులేని అద్భుత అనుభూతి కలిగింది. ఆహా! ఏమి ఈ విశేషం! ఈ పర్వతరాజం ఇంత మహిమాన్వితమైనదా! అందుకనే కాబోలు శ్రీమన్నారాయణులవారు మానవుల సకల పాపాలూ తొలగి పోవడానికి ఈ పర్వతరాజంపై కాలుపెట్టటమే చాలునని చెప్పాడు. ఇప్పుడు ఆ స్వామివారి మాటలకు అర్థం తనకు గోచరించింది అని తలుస్తూ కొండనెక్కుతున్న అగ్ని దేవుడు ఎందరో భక్తులను గమనించాడు. అగ్ని దేవుడు దివ్యరూపంలో వుండడంచేత ఎవరికీ కనిపించుట లేదు.

కొండనెక్కుతున్న భక్తులందరూ ఎంతో సంతోషంతో ముచ్చట్లాడుతూ ఏ మాత్రం శ్రమ తెలీకుండా ఎక్కడం చూసి అగ్ని ఎంతో ఆనందపడ్డాడు. వారందరి మాటలు వింటూ ఎన్నో విశేషాలు తెలుసుకున్నాడు. ఈ వేంకటాద్రి అతి మహిమాన్వితమైనదని ఎన్ని జన్మల పాపాలైనా ఈ క్షేత్ర దర్శనంతో తొలగిపోతాయని గ్రహించాడు. వారందరి మాటలను బట్టి ఈ స్వామిని నమ్ముకున్న వారి జీవితాలలో ఎన్నో దివ్యలీలలు జరిగినట్టు గ్రహించాడు. ఒక భక్తుడు ఎంతో తీవ్రమైన వ్యాధితో బాధ పడుతూ ఈ క్షేత్రానికి మొక్కుకోగానే వ్యాధి నయమైంది. మరొకరికి కంటిచూపులేక బాధ పడుతుండగా ఈ క్షేత్రం దర్శిస్తానని మనస్సులో సంకల్పించగానే పూర్తి చూపు కలిగింది. ఎంతో దారిద్ర్యంతో బాధ పడుతున్న మరొక భక్తునికి సర్వ ఐశ్వర్యాలు లభించాయి. యుక్త వయస్సు దాటినప్పటికీ వివాహం కాని కన్యకు ఈ క్షేత్ర దర్శనం చేసుకుంటానని సంకల్పించగానే మంచి వరునితో వివాహం నిశ్చయమైంది. మరొకరికి వ్యాపారంలో ఎన్నో లాభాలొచ్చాయి. ఈ విధంగా ఎందరో ఈ స్వామిని నమ్ముకున్న ఎందరో భక్తులకు ఎన్నో లీలలు జరిగినట్లు అగ్నిదేవుడు గ్రహించాడు.

ఆహా! ఈ వేంకటాద్రి సామాన్యమైనది కాదు. లేకపోతే ఇన్ని అద్భుతాలు జరగడమేమిటి? ఈ కొండపై కొలువున్న స్వామి తప్పక ఎంతో మహిమాన్వితమైనవాడనటంలో సందేహం లేదు. ఇంతకీ ఆ దేవత ఎవరై వుంటారు? ముమ్మూర్తులలో ఒకరా! లేక జగన్మాత శ్రీమహాలక్ష్మియా? లేక సాక్షాత్తూ ఆ పరమేశ్వరియేనా? లేక మరెవరైనా దివ్య మూర్తియా? ఎవరైనప్పటికీ ఈ కొండపైనున్న దేవత తప్పక సర్వశక్తి మంతుడై వుండాలి. లేకపోతే ఈ కొండ ఇంత దివ్యంగా ప్రకాశించడమూ, ఈ భక్తులందరికీ ఇన్ని దివ్యలీలలు జరగడమూ సాధ్యపడదు అని తలుస్తూ కొండనెక్కుతున్నాడు అగ్నిదేవుడు.

అగ్ని మేష స్వరూపుడు. వేంకటాద్రి ప్రకృతి సందపను చూసి ఎంతో ముచ్చటపడి కాసేపు మేష స్వరూపం దాల్చి చెంగు చెంగున దూకుతూ ఎంతో సరదా పడుతూ కొండనెక్కసాగాడు అగ్నిదేవుడు. ఆహా! ఎంత దివ్యంగానున్నది ఇక్కడ ప్రకృతి. చెట్లపై పక్షుల కిలా కిలారావాలు, అందమైన సెలయేర్లు, మధ్య మధ్య సన్నటి నీటి తుంపర, మేష రూపంలో వెళుతున్న అగ్నిదేవుడు వేంకటాద్రి ప్రకృతి సౌందర్యానికి ఎంతో ముచ్చట పడ్డాడు. అగ్నికి మరిన్ని అద్భుతాలు కనబడ్డాయి. ఆ కొండపై గల క్రూర మృగాలన్నీ తమ తమ సహజ వైరి స్వభావాన్ని మరచి స్నేహ వాత్సల్యాలతో ప్రవర్తిస్తున్నాయి. జింక పిల్లలు సింహంతో ఆడుకుంటు న్నాయి. మరొకచోట పాములు, ముంగీసలు కలిసి వుండటం కనిపించింది. మరొకచోట కుందేళ్ళు వేటకుక్కలతో సహవాసం చేస్తున్నాయి. ఆహా! ఈకొండ సామాన్యమైనది కాదు సుమా అని తలచాడు అగ్నిదేవుడు.

'స్వామీ! శ్రీమన్నారాయణా నాకు ఇప్పుడు అర్థమైంది. ఈ వేంకటాద్రి ఎంతో అద్భుతమైన ప్రదేశము కాబట్టే నీవు అంతగా దీనిగురించి చెప్పావు. అందులకే మమ్మలను వేంకటాద్రి దర్శనం చేయవలసిందిగా ఆదేశించావు'. అని తలుస్తూ అగ్ని చివరికి కొండపైకి వచ్చాడు. దూరం నుంచి అక్కడి ఆలయం ఎంతో అద్భుతంగా వెలిగిపోతూ కనిపించింది. ఆలయంపై వున్న ఆకాశం దివ్య తేజస్సుతో కనిపించింది. వింత వింత వేషధారణలో వున్న భక్తులు భజనలు చేస్తూ ఆలయంలోనికి వెళుతున్నారు. వారితోపాటు తానుకూడా లోనికి వెళ్ళాడు. లోపల ఆలయగోడలకు వున్న అద్భుత శిల్పసంపదను చూసి అగ్నిదేవుడు ఎంతో ఆశ్చర్యపోయాడు. ఆలయ సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ గర్భాలయం వద్దకు చేరుకున్నాడు.

గర్భాలయం చేరిన అగ్ని ఒకసారి కనులు మూసుకుని శ్రీమన్నారాయణులవారిని తలచుకుని కనులు తెరిచాడు. ఆశ్చర్యం! ఎదురుగా త్రిశూల ధారియైన మహేశ్వరుడు దర్శనమిచ్చాడు! ఆహా! ఈ

ఆలయంలో మూలమూర్తిగా కొలువై ఇందరి భక్తుల పూజలందు కుంటున్న స్వామి సాక్షాత్తూ ఆ నీలకంఠుడేనా! శ్రీమన్నారాయణుడు చెప్పినటువంటి దేవత సాక్షాత్తూ మహేశ్వరుడా! ఆహా! భూలోకంలోని మానవులు ఏ పుణ్యక్షేత్ర దర్శనం చేత సర్వపాపాలనుండి విముక్తులు కాలగరని దేవతలమందరమూ శ్రీమన్నారాయణులవారిని అడిగినప్పుడు వేంకటాద్రి చేరి అక్కడ కొలువున్న దేవుని దర్శించమన్నాడు. అక్కడ వున్నది ఎవరో తమనే తెలుసుకొనమని అన్నాడు. అంతేకాని సాక్షాత్తూ పరమేశ్వరుడే వున్నాడని ముందు చెప్పలేదు. ఆహా! హరిహరుల మైత్రి లోక విదితమే కదా. ఇక్కడ వున్నది సాక్షాత్తూ కేశవునికి అత్యంత ప్రియ సఖుడైన పరమేశ్వరుడే కదా. ఆహా! ఎంత దివ్యంగా వున్నది ఈ మహేశ్వరుని విగ్రహం అని తలచాడు.

జటాజూటంతో, నెలవంకతో, నాగాభరణాలతో దివ్యంగా ప్రకాశిస్తున్న పరమేశ్వరునికి నమస్కరించి అగ్ని ఈవిధంగా అన్నాడు. ఓ పరమేశ్వరా! పార్వతీవల్లభా! పన్నగధరా! నీకివే నా నమస్కారములు. ఓ మహేశ్వరా! సర్వలోకాలకూ ఆధారభూతడవైన నిన్ను దర్శించిన నేను ధన్యుడనైనాను. లయకారకుడవైన నీకివే నా ప్రణామములు. ఓ కైలాసగిరివాసా! నీకివే నా నమస్కారములు. లయకారకుడవైన నీకివే నా ప్రణామములు. ఈ భూమండలంపై సర్వ మానవుల పాపాలనూ క్షణంలో హరించే ఈ వేంకటాద్రి క్షేత్రాన్ని మించిన దివ్యక్షేత్రం మరొకటి లేదని శ్రీమన్నారాయణులవారి ద్వారా తెలుసుకున్నాను. ఇక్కడ వున్న దేవత ఎవరై వుంటారా అని ఆతృతతో వచ్చాను. ఆహా! ఎంతటి దివ్య దర్శనం ఇచ్చావు తండ్రీ! శివకేశవులకు బేధం లేదు కదా స్వామీ! ఎంతో దివ్య మంగళ రూపంలో దర్శనమిచ్చి నన్ను ధన్యుడను చేసితివి. నీ ముగ్ధ మనోహర రూపం కనులారా చూస్తుంటే ఇచ్చటనుంచి ఒక్క అడుగు కూడా కదలబుద్ధి కావటం లేదు. నీ దివ్యరూపం చూస్తున్న కొద్దీ మరలా చూడాలనిపిస్తున్నది. ఈ

మానవులు తమ తమ కోరికలు తీరడానికి ఎంతో కష్టాలు పడుతూ, ఎంతో దూరప్రదేశాలలో వున్న ఎన్నో క్షేత్రాలు నిత్యం దర్శిస్తున్నారు, ఎందరో దేవతలను ప్రార్థిస్తున్నారు. కానీ ఈ వేంకటాద్రి చేరి నీ దర్శనంచేత సర్వ పాపాలనుంచి విముక్తి కాగలరని గ్రహించినవారి జన్మ ధన్యం. ఈ విషయం సాక్షాత్తూ శ్రీమన్నారాయణులవారే శెలవిచ్చారు. ఈ క్షేత్రంలో కాలు పెట్టినంత మాత్రముననే జన్మ జన్మల పాపాలన్నీ పటాపంచలవుతాయి అన్నమాట తథ్యము. సమస్త ఐశ్వర్యములు చేకూరుతాయి అనుట కూడా సత్యము. ఇక్కడ కొలువున్న ఓ పరమేశ్వరా! నీకివే నా నమస్కారములు. ఓ పార్వతీ వల్లభా! నీకివే నా ప్రణామములు. అని మహేశ్వరుని అనేక విధాల స్తుతించి అగ్నిదేవుడు తిరిగి తన లోకానికి పయనమైనాడు.

అగ్నిదేవుడు వెళ్లిన కొద్దిరోజులకు శ్రీమన్నారాయణుని ఆదేశం ప్రకారం వాయుదేవుడు భూలోకానికి వేంకటాద్రి దర్శనార్థమై బయలు దేరాడు. సువర్ణముఖీ నదీ తీరం చేరిన వాయుదేవుడు మనస్సులో ఇలా తలుస్తున్నాడు. భూలోకంలో ఎన్నో పుణ్యక్షేత్రములు వున్నవి కదా. వీటిలో ఎందరో దేవతలు కొలువై భక్తుల పూజలందుకుంటూ వారి వారి కోర్కెలు నెరవేరుస్తున్నారు. వీటన్నిటిలోనూ మహామహిమాన్వితమై కేవలం తలచినంతమాత్రముననే వేలజన్మల పాపాలు హరించ గలిగేటటు వంటిదియు, కేవలం అడుగు పెట్టినంత మాత్రముననే కొన్ని లక్షల జన్మల పాపాలు నశించేటటువంటిదియు, కేవలం దర్శనమాత్రముననే కొన్ని కోట్ల జన్మల పాపాలు పరిహారం చేసే దేవత కొలువై వున్నటువంటిదియు అయిన క్షేత్రం ఏమైనా వుంటుందా? అసలు అంతటి మహిమాన్వితమైన క్షేత్రం భూలోకంలో వున్నదా అనే ఆలోచన తన మదిలో ఎప్పుడూ కలిగేది. ఇదే ప్రశ్న శ్రీమన్నారాయణులవారిని అడిగినప్పుడు స్వామి దానికి సమాధానంగా భూలోకంలో వేంకటాద్రి అనే క్షేత్రం కలదని, ఆ క్షేత్ర దర్శనంచే సర్వ పాపాలూ విముక్తి అవుతాయని అన్నారు. అక్కడ కొలువున్న దేవుడు

ఎవరని అడుగగా తామే వెళ్ళి దర్శించమన్నారు. చాలా ఆతృతగా వున్నది. ఇంతటి దివ్య తేజస్సు కలిగి, ఇంతటి దివ్యానుగ్రహం ప్రసాదించే దేవత ఎవరై వుంటారో అని తలచాడు వాయుదేవుడు. సృష్టి కారకుడైన బ్రహ్మదేవుడా లేక లయకారకుడైన పరమేశ్వరుడా? లేక స్థితికారకుడైన సాక్షాత్తూ ఆ వైకుంఠవాసుడేనా? నాకీ విషయం చెప్పక స్వయముగా వెళ్ళి దర్శించి తెలుసుకొనమనటంలో స్వామి ఉద్దేశ్యం అదేనేమో! లేక శరణవ సంభవుడైన షణ్ముఖుడే ఇక్కడ కొలువున్నాడా అని తలుస్తూ వాయుదేవుడు వేంకటాద్రి వద్దకు చేరాడు. వేంకటాద్రి సమీపాన్ని చేరి ఆ కొండపై కాలు పెట్టగానే వాయుదేవునికి ఒక్కసారిగా శరీరమంతా ఏదో తేజస్సు ప్రవహించినట్లైంది. ఆహా! ఈ పర్వతము సామాన్యమైనది కాదు సుమా. ఇంతకు మునుపు తాను ఎన్నో దివ్యక్షేత్రములు దర్శించి వున్నాడు. కానీ ఎన్నడూ ఇటువంటి అనుభూతి తనకు కలుగలేదు. కేవలం కాలు తగలగానే దివ్య తేజస్సు శరీరమంతా ప్రవహించింది. ఈ వేంకటాద్రి తప్పక మహా మహిమాన్వితమైదనటంలో ఏ మాత్రం సందేహం లేదు అని తలుస్తూ కొండనెక్కసాగాడు.

అద్భుతమైన ప్రకృతి సంపదకు ఎంతో ముచ్చటపడ్డాడు. ఎందరో భక్తులు భజనలు చేస్తూ, పాటలు పాడుకుంటూ తన్మయత్వంలో మునిగి తేలుతూ కొండనెక్కడం గమనించాడు. వీరందరూ కిందటి జన్మలలో తప్పక ఎంతో పుణ్యం చేసియుంటారు. లేకపోతే ఇంతటి అద్భుతమైన పర్వతంపై కాలుపెట్టే అదృష్టానికి నోచుకొనలేరు అని వాయుదేవుడు తలచాడు. ఆహా! వీరందరూ ఎంతటి అదృష్టవంతులో కదా అని అనుకున్నాడు. సాక్షాత్తూ ఆ పవనుడే వారితో కలిసి కొండనెక్కుతున్నందువలన వాతావరణం ఎంతో ప్రశాంతంగా వున్నది. చల్లటి గాలి వీస్తున్నది. కొండనెక్కుతున్న భక్తులెవ్వరికీ ఎటువంటి శ్రమ తెలియటం లేదు.

దివ్య శరీరంతో కొండనెక్కుతున్న వాయుదేవునికి అనేక విశేషాలు కనపడ్డాయి. పుట్టు మూగవాడైన ఒక భక్తునికి కొన్ని మెట్లు ఎక్కగానే మూగతనం పోయి మాటలు రావటం గమనించాడు. దీర్ఘకాల వ్యాధితో బాధపడుతున్న మరొక భక్తునికి సగం కొండ ఎక్కగానే పూర్తి ఆరోగ్యం చేకూరింది. ఇలా వారందరికీ ఎన్నో దివ్యలీలలు జరుగుతున్నట్లు గ్రహించాడు. సామాన్య మానవులతోపాటు ఎంతోమంది మునీశ్వరులు కూడా కొండనెక్కటం గమనించాడు. ఆహా! ఎంతో శక్తిమంతులైన ఈ మునీశ్వరులు కూడా ఈ వేంకటాద్రి ఎక్కి పైన కొలువున్న స్వామిని దర్శించడానికి వస్తున్నారంటే ఇది సామాన్య క్షేత్రం కాదు. వేంకటాద్రి మహా పుణ్యక్షేత్రం అనటంలో సందేహం లేదు అని తలచాడు.

ఇలా కొంత దూరం ఎక్కగానే వాయుదేవునికి కొంత దూరంలో దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్న ఒక భక్తుడు కనపడ్డాడు. ఆ భక్తుని తేజస్సుతో ఆ చుట్టుప్రక్కల ప్రదేశమంతా ప్రకాశిస్తున్నది. ఆ తేజస్సువలన అక్కడ వున్న భక్తులందరికీ ఎంతో దివ్యానుభూతులు కలుగుతున్నట్టు గమనించాడు వాయుదేవుడు. ఏమిటీ దివ్య తేజస్సు? ఎవరా భక్తుడు? దేవతలకు కూడా లేనటువంటి అంతటి అద్భుత తేజస్సుతో ప్రకాశిస్తున్న ఈ భక్తుడు ఎవరై వుంటారు? అని తలచాడు. తప్పక ఇతనెవరో మహానుభావుడై వుండి వుండాలి అనుకున్నాడు. ఆ భక్తుడు విచిత్ర వేషధారణలో వున్నాడు. తలపై పాగ, మంచి ధోవతి ధరించి విచిత్రంగా వున్నాడు. చంకన పిల్లనగ్రోవి కూడా వున్నది. ఈ భక్తుడు ఎవరై వుంటారా అని తలుస్తూ దగ్గరకు వచ్చిన వాయుదేవునికి ఒక్కసారి నోటమాట రాలేదు. దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న ఆ భక్తుడు మరెవరో కాదు. సామాన్య మానవుని రూపంలో ఉన్న ఆ భక్తుడు సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే!. అయితే అక్కడ నడుస్తున్న భక్తులెవరికీ ఈ విషయం తెలియక శ్రీ స్వామివారిని తనలో ఒక భక్తునిగా తలచి కొండనెక్కుతూ వెళుతున్నారు. శ్రీ స్వామివారు

దగ్గరకు రాగానే వాయుదేవుడు రెండు చేతులూ జోడించి శ్రీమన్నారాయణుడితో ఇలా అన్నాడు. స్వామీ జగన్నాథా! జగద్రక్షకా! సమస్త సృష్టికీ ఆధార భూతుడవైన నీకివే నా నమస్కారములు. ఎక్కడి వైకుంఠము? ఎక్కడి వేంకటాద్రి? నీవిక్కడ ప్రత్యక్షమవ్వడంలో ఆంతర్యమేమిటి? వైకుంఠంలో దివ్యంగా ఆదిశేషునిపై శయనిస్తూ జగన్మాత శ్రీ మహాలక్ష్మిచే పరిచర్యలు చేయించుకునే నీవేమిటి, సామాన్య మానవునిలాగా ఈ కొండపై సంచరించుట ఏమి! అందునా ఈ విచిత్ర వేషధారణ ఏమి? నాకు అర్థం కాకున్నది అని ప్రశ్నించాడు.

అప్పుడు శ్రీమన్నారాయణులవారు వాయుదేవునితో ఇలా అన్నారు. ఓ వాయుదేవా! నాకు ఈ వేంకటాద్రి అన్నచో మిక్కిలి ఇష్టము. రోజూ ఇక్కడ అనేక రూపాలలో నేను ఈ భక్తుల మధ్య సంచరిస్తుంటాను. వీరందరి మధ్యా కలిసి తిరగడం నాకెంతో ఆనందకరం. ఇంతకుమించిన ఆనందం నాకు లేదు. ఇచ్చటి ప్రకృతి సౌందర్యమన్న నాకెంతో ప్రియము అని అన్నాడు.

అప్పుడు వాయుదేవుడు శ్రీమన్నారాయణులవారితో ఇలా అన్నాడు. 'స్వామీ! జగన్నాథా! జగన్నాయకా! నీకివే నా నమస్కారములు. నీకు గల భక్తవాత్సల్యత గురించి ఎంతో విన్నాను. ఎన్నో సార్లు అనుభవైకవైద్యం అయింది. ఇప్పుడు మరలా ప్రత్యక్షంగా చూస్తున్నాను. నీ భక్తులంటే నీకు అలవిమాలిన ప్రేమ, అది నాకు తెలిసినదే. నాకు అర్థం కానిదల్లా నీవు ఈ కొండపై ఎందుకు తిరుగుతున్నావు. ఇంతకీ ఈ కొండపై కొలువున్న దేవుడెవరో దయచేసి నాకు చెప్పవలసింది. నాకు తెలుసుకోవాలని ఎంతో ఆతృతగా వున్నది' అని అన్నాడు. అప్పుడు స్వామి వాయుదేవునితో 'ఓ వాయుదేవా! నీ ఆతృత నాకు అర్థమైంది. ఎందుకు నీకా తొందర! ఇంకా ఎక్కువ దూరం లేదు కదా? ఇంక కొద్ది సేపట్లో కొండనెక్కటం పూర్తవుతుంది. కొండపై గల ఆలయంలో వున్న పరబ్రహ్మమూర్తి దర్శనం

నీకు తప్పక కలుగుతుంది. అప్పుడు నీకు అక్కడ వున్న దేవత ఎవరో వివరంగా అర్థం కాగలదు, వేరే నేను చెప్పటం ఎందుకు? అని అన్నాడు. అప్పుడు వాయుదేవుడు స్వామీ! నీవు చెప్పినది సత్యమే! కానీ నాకు కొండపై వున్న దేవత ఎవరై వుంటారా అని తెలుసుకోవాలని ఎంతో ఆత్రంగా వున్నది. ఎందుకంటే సర్వాంతర్యామివైన నీవే ఈ కొండపై తిరగటం ఆనందంగా వుంటుందని అంటున్నావంటే పైన కొలువున్న దేవత సామాన్య దేవత కాజాలదు. ఆ పరబ్రహ్మమూర్తి దర్శనం తప్పక చేసుకొనవలసిందే. అని చెప్పి శ్రీమన్నారాయణులవారి వద్ద శెలవు తీసుకుని కొండనెక్కటం సాగించాడు.

కొండనెక్కి భక్తులతో కలిసి ఆలయంలోనికి ప్రవేశించాడు వాయుదేవుడు. ఆ పరిసరాలలోనికి రాగానే ఆ ప్రదేశమంతా ఎంతో దివ్య తేజస్సుతో వెలిగిపోతున్నట్లు తోచింది. ఒక్క దేవత ఏమిటి, బహుశా సర్వ దేవతా సమూహమూ ఇక్కడనే కొలువున్నది కాబోలు. లేకపోతే ఇంతటి మహత్తర అనుభూతియా అని తలుస్తూ గర్భాలయంలోనికి చేరాడు. ఒక్కసారి కనులు మూసుకుని శ్రీమన్నారాయణులవారిని మనస్సులో ప్రార్థించి తిరిగి కనులు తెరిచాడు. అంతే అక్కడ ఎదురుగా వున్న మూలమూర్తిని చూచి ఒక్కసారి నివ్వెరపోయాడు. అక్కడ వున్నది సమస్త విద్యలకు ఆలంబనగా వుండే వాగ్దేవత సరస్వతి! వెంటనే ఆ తల్లికి నమస్కరిస్తూ ఇలా అన్నాడు. తల్లీ! వీణాపాణీ! నీకివే నా నమస్కారములు. వాక్శుద్ధి, ప్రతిభ, ఆలోచన, వివేకము, మేధ, ధారణ, స్మృతి, ప్రజ్ఞ, ఇవన్నీ నీ రూపాలే కదా తల్లీ? దివ్య మంగళ స్వరూపంలో భక్తజన కోటికి అనుగ్రహిస్తున్న నీకివే నా నమస్కారములు. సాక్షాత్తూ ఆ చతుర్ముఖుని ప్రియసఖివైన నీవా తల్లీ ఇక్కడ కొలువున్నది? నిన్ను దర్శించినంత మాత్రమునే సమస్త మానవకోటి పునీతులౌతున్నారు. నీ దర్శన భాగ్యం చేత నాకు మహదానందము కలుగుతున్నది. ఇక్కడ వేంకటాద్రిపై కొలువున్న

నిన్ను దర్శించిన నేను ధన్యుడనైతిని. నన్ను అనుగ్రహింప వలసినది అని వాగ్దేవిని ఎన్నో విధాల స్తుతించి ఆ తల్లివద్ద శెలవు తీసుకుని వాయుదేవుడు తనలోకానికి తిరిగి పయనమైనాడు.

వాయుదేవుడు వెళ్లిన కొన్నిరోజులకు శ్రీమన్నారాయణులవారి ఆదేశం ప్రకారం కుబేరుడు భూలోకంలోని వేంకటాద్రి దర్శనార్థమై బయలుదేరాడు. సువర్ణముఖీ నదీ తీరానికి వచ్చి కొంతదూరం తరువాత వేంకటాద్రి చేరాడు. ఆ పర్వతంపై కాలు పెట్టగానే ఏదో దివ్యమైనశక్తి ఆవహించినట్లు అనిపించింది. ఏమిటి ఈ తేజస్సు? ఒక పర్వతానికి ఇంత శక్తియా? ఇంత తేజస్సా? ఇంతకుముందు తాను ఎన్నో శ్రేణులను చూశాడు. ఎన్నో దివ్య క్షేత్రాలను దర్శించాడు. కానీ ముందెన్నడూ ఇటువంటి అద్భుత అనుభూతి కలుగలేదు. అని ఆలోచిస్తూ ఆ కొండపై కాలు తిరిగి పెట్టడానికి సంకోచించాడు. ఈ వేంకటాద్రి ఏదైనా ఏదైనా దివ్య దేవతయే కాబోలు. ఈ పర్వత రూపంలో వున్న ఈ దేవతపై కాలు పెట్టటం మహా పాపం కానేరదు కదా! అయినా తప్పదు కదా. శ్రీమన్నారాయణుడు ఈ వేంకటాద్రి ఎంతో దివ్యక్షేత్రమని దానిపై గల దేవత ఎన్నో దివ్య మహిమలు కలవాడని చెప్పాడు. కాబట్టి తప్పక ఈ పర్వతరాజమును ఎక్కి ఆ దేవతను దర్శించవలసిందే అని తలచాడు. ఒక్కసారి కనులు మూసుకుని రెండు చేతులూ జోడించి వేంకటాద్రికి నమస్కరించాడు. ఓ పర్వతరాజమా, నీపై కాలిడుతున్నందుకు నన్ను క్షమింపవలసింది అని ప్రార్థించి, పిమ్మట ఒక్కొక్క అడుగూ వేస్తూ కొండనెక్కసాగాడు.

పిల్లలు, ఆడవారు, వయస్సు మీరినవారు ఇలా ఎందరో భక్తులు ఏమాత్రం శ్రమ లేకుండా కొండనెక్కడం చూసి ఆశ్చర్యపోయాడు. శ్రమ లేకపోవటం కాదు కదా. వారందరి ముఖాలలో ఎంతో ఆనందం గమనించాడు. ఆహా! ఈ వేంకటాద్రి సామాన్యమైనది కాదు! అందువలననే వీరెవరికీ ఏమాత్రం శ్రమ తెలియటం లేదు అని తలచాడు. ఈ కొండపై

కాలిడినంతనే కొన్ని కోట్ల జన్మల పాపాలు పటాపంచలవుతాయని గ్రహించాడు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే ఈ వేంకటాద్రి గురించి చెప్పాడంటే ఇది భూమండలంలోకెల్ల తప్పక దివ్యమైన క్షేత్రమై వుండి వుంటుంది. కొండనెక్కుతున్నవారికి ఆకలిదప్పులు కూడా తెలియటం లేదంటే ఇది ఎంతో మహా మహిమాన్వితమైనదనటంలో ఏ మాత్రం సందేహం లేదు. ఇంత అద్భుత పర్వత రాజంపై కొలువున్న దేవుడు ఎవరో కదా. కొండనెక్కుతున్న భక్తులందరూ స్వామి అని సంబోధించటం గమనించాడు. ఎవరీ స్వామి? సాక్షాత్తూ త్రిమూర్తులలోని ఒక్కరా? లేక త్రిశక్తులలోని ఒక్కరా? ఎవరై వుంటారు? అని ఇలా తలుస్తూ కొండనెక్కి ఆలయ సమీపానికి చేరుకున్నాడు. ఆలయ పరిసరాలన్నీ దివ్య తేజస్సుతో వెలిగిపోతున్నాయి. ఆ ప్రదేశమంతా ఓంకార నాదంతో ప్రతిధ్వనిస్తున్నది. ప్రణవ నాదంతో భక్తులు దివ్య అనుభూతులకు లోనౌతున్నారు. అనేక దేవతా మంత్రాలు దివ్య శక్తి తరంగాలతో వినపడుతున్నాయి. మనస్సు ఆహ్లాదకరంగా వున్నది. ఆలయపరిసరాలలోనే ఇంత అద్భుతంగా వుందంటే ఈ ఆలయంలో కొలువున్న దేవుడు మహా మహిమాన్వితుడై వుంటాడు. దీనిలో ఏ మాత్రం సందేహం లేదు అని తలచాడు కుబేరుడు.

ఇలా తలుస్తూ కుబేరుడు గర్భాలయంలోనికి చేరాడు. ఒకసారి కనులు మూసుకుని శ్రీమన్నారాయణులవారికి మనస్సులోనే ప్రార్థించి తిరగి కనులు తెరిచి ఎదురుగా వున్న మూలమూర్తిని దర్శించాడు. ఆ మూర్తిని చూసి ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు! అక్కడ వున్నది సాక్షాత్తూ పరంధాముడు, పురుషోత్తముడైన శ్రీమన్నారాయణుడే! స్వామి శంఖ చక్రాలతో అద్భుత దివ్య మంగళ రూపంలో ప్రకాశిస్తున్నాడు. ఎదురుగా స్వామిని చూసిన కుబేరుని ఆనందానికి అంతు లేదు. తండ్రీ! జగన్నాథా! లక్ష్మీ వల్లభా! నీవేనా ఇక్కడ కొలువున్నది! ఆహా! 'నిన్ను దర్శించిన నేను ఎంతో ధన్యుడను. ఈ సమస్త విశ్వానికీ ఆధారభూతుడవైన నీవేనా ఈ వేంకటాద్రిపై

కొలువున్నది! 'త్రిగుణాత్మకుడవు, త్రికాలరూపుడవు, పాపహరునవు, నిరాకారుడవు, నిరామయుడవు, పురుషోత్తముడవు అయిన నీకివే నా నమస్కారములు. ఏ పరబ్రహ్మమూర్తి దివ్యదర్శనానికై, దివ్య అనుగ్రహానికై సమస్త దేవతాకోటి సర్వవేళలయందు నిరీక్షించుచున్నదో ఆ అమృతమూర్తివి నీవే తండ్రీ! సర్వ దిశలూ నీవే! సర్వ గాయత్రులూ నీ స్వరూపమే! సర్వ ఛందస్సులూ కూడా నీవే. నల్లని మేఘం వంటి శరీర కాంతితోడనూ, అత్యంతముగా ప్రకాశిస్తున్న పీతాంబరంతోనూ, శ్రీవత్స చిహ్నముతోడనూ, వక్షస్థలమున కౌస్తుభమును ధరించినవాడివై, అద్భుత ప్రసన్నవదనంతో విరాజిల్లుతున్న నీ దర్శన భాగ్యముచే నేను తరించినాడను. నీకివే నా నమస్కారములు అని అనేక విధాల స్తుతించి తిరిగి తన లోకానికి పయనమైనాడు.

కుబేరుడు వెళ్లిన కొన్ని రోజులకు ఈశానుడు శ్రీమన్నారాయణులవారి ఆదేశం ప్రకారం వేంకటాద్రి దర్శనార్థమై భూలోకానికి చేరాడు. కొండలూ, కోనలూ దాటుకుంటూ సువర్ణముఖీ నదీ తీరం చేరాడు. చుట్టూ ఎన్నో కొండలు కనబడ్డాయి. శ్రీమన్నారాయణులవారు చెప్పిన వేంకటాద్రి ఇక్కడే ఎక్కడో వుండాలి. వీటిలో వేంకటాద్రిని ఏవిధంగా గుర్తించాలి అని తలచాడు. ఒక్కొక్క కొండా దాటుతూ ముందుకు వచ్చాడు. ఆ తరువాత కొండను చూడగానే ఇదే వేంకటాద్రి అయి వుండవచ్చునని తోచింది. ఇంతలో ఎందరో భక్తులు ఆ కొండనెక్కుతూ కనబడ్డారు. ఆహా! ఇదియే తప్పక వేంకటాద్రి అయి వుంటుంది అని తలచి ఆ కొండపై కాలు పెట్టాడు. అంతే కాలు తగలగానే ఒక్కసారిగా శరీరంలోకి ఏదో దివ్యమైన శక్తి ప్రవేశించినట్లైంది. ఈశానునికి ఎంతో ఆశ్చర్యం కలిగింది. సర్వ శక్తి సంపన్నుడనైన నాకే ఇంత దివ్యంగా అనిపిస్తుంటే ఇక మిగిలిన వారి సంగతి వేరే చెప్పాలా? ఆహా! అద్భుతం! తాను మునుపు ఎన్నో దివ్య

క్షేత్రాలను దర్శించి వున్నాడు. కానీ ఏ క్షేత్రంలోనూ ఇంతటి దివ్యానుభూతి కలుగలేదు. తప్పక ఈ వేంకటాద్రి ఎంతో మహిమ కల పర్వతమనుటలో ఏ మాత్రం సంశయం లేదు. ఈ కొండపై కొలువున్న దేవత తప్పక ఆ పరమేశ్వరునితోనే సాటి రాగలడని తోస్తున్నది. లేకపోతే ఈ కొండకు ఇంత మహిమ కలుగజాలదు అని తలచాడు.

భక్తులందరితో కలిసి కొండనెక్కుతున్న ఈశానునికి అనేక దివ్య అనుభూతులు కలుగసాగాయి. కొంతదూరం ఎక్కగానే ఎదురుగా కొండ దిగి వస్తున్న హనుమంతులవారు కనబడ్డారు. సాక్షాత్తూ వాయునందనుడే కనిపించటంతో ఈశానుడు ఆశ్చర్యపోయాడు. పవనసుతునికి నమస్కరించి ఇలా అన్నాడు. 'ఓ ఆంజనేయా! మహానుభావా! నీకివే మా నమస్కారములు. నీవేమిటి, ఇక్కడ దర్శనమీయటమేమిటి? ఈ కొండ ఎంతో విశేషమైనది అయితే తప్ప నీవిచ్చట సంచరింపజాలవు అని అన్నాడు.

అప్పుడు హనుమంతుడు ఈశానునితో" అవును దేవా! ఈ వేంకటాద్రి నాకెంతో ప్రియము. నేను జన్మించినది ఈ పవిత్ర పర్వతంపైననే కదా! నాకీ పర్వత శ్రేణి అంటే ఎంతో ప్రియము. ఇక్కడ విహరించుట నాకెంతో ఆనందదాయకము. స్వామి భక్తుల మధ్య వారి కబుర్లు వింటూ తిరగడం అంటే నాకెంతో ప్రీతికరం. స్వామి దర్శనార్థమై వచ్చే వీరందరినీ చూస్తుంటే నాకు చాలా సంతోషం కలుగుతుంది. అని చెప్పి మెట్లు దిగుతూ వెళ్ళిపోయాడు. అరే ఒక్క క్షణంలో వెళ్ళిపోయాడే, కొండపై వున్న స్వామి ఎవరో ఇంతకీ అడుగనే లేదు అని తలచాడు ఈశానుడు. స్వామి, స్వామి అని సంబోధించాడే తప్ప పైన కొలువున్న దేవత ఎవరో చెప్పనేలేదు. అదేమాట అడుగుదామని అనుకునేటంతలోనే క్షణంలో మాయమయ్యాడు అని తలచాడు ఈశానుడు. ఇంతకీ ఈ కొండపై వున్నది ఎవరై వుంటారు? శ్రీమన్నారాయణుడా? మహేశ్వరుడా? ఆదిశక్తియా? అని ఇలా తలుస్తూ భక్తులతో కలిసి కొండనెక్కాడు ఈశానుడు.

ఈశానుడు కొండపై ఎంతో సంతోషంగా భజనలు చేస్తూ, కీర్తనలు పాడుతూ ఆనందంగా కేరింతలు కొడుతున్న భక్తులను చూశాడు. ఆహా! వీరందరూ ఎంతటి ఆనందంలో వున్నారు! తమ తమ బాధలు, తమకు గల సమస్యలు అన్నింటినీ మరచిపోయి పూర్తి తన్మయత్వంతో ఎలా పరవశించిపోతున్నారో కదా, ఆహా! ఈ స్వామి వీరందరినీ తన భక్త సముద్రంలో ఎంతగా ముంచెత్తుతున్నాడో కదా! ఇలా తలుస్తూ ఈశానుడు ఆలయం వద్దకు చేరాడు.

భక్తులతో కలిసి ముందుకు సాగుతూ గర్భాలయం చెంతకు చేరుకున్నాడు. ఒకసారి కనులు మూసుకుని శ్రీమన్నారాయణుని మనసులో ప్రార్థించి కనులు తెరిచాడు. ఆహా! అద్భుతం! ఎదురుగా శ్రీ నారసింహ స్వామి దర్శమిచ్చాడు. 'స్వామీ! కేశవా! శ్రీ నారసింహా! నీవా తండ్రీ ఈ కొండపై కొలువున్నది! అని తలచాడు. ఆ స్వామి రూపం దివ్య మంగళ మనోహరంగా వున్నది. భక్తుల పాలిటి కల్పవృక్షమై నిలచే ఆశ్రిత జన రక్షకుడు శ్రీ నారసింహుడు. గర్భాలయంలో కొలువున్న శ్రీ నారసింహుని దివ్య రూపాన్ని గాంచి ఈశానుడు 'ఓ పురుషోత్తమా! పరంధామా! అనాథ రక్షకా! భక్తవల్లభా! పరమపురుషా! పావననామా! నీకివే నా నమస్కారములు. నీ దర్శన భాగ్యంచే నేను కృతార్థుడనైతిని. నేనెంత ధన్యుడని చెప్పుదును. సర్వకాల సర్వావస్థలయందును శరణన్న వారిని తక్షణమే రక్షించే ఆశ్రిత జన వత్సలుడవు. నీకివే నా ప్రణామములు అని అనేక విధాల స్తుతించి తిరిగి తన లోకానికి పయనమైనాడు.

ఈశానుడు వెళ్ళిన కొన్నిరోజులకు నిరుతి వేంకటాద్రికి పయనమైనాడు. భూలోకం చేరి సువర్ణముఖీ నదీ సమీపానికి వచ్చాడు. అక్కడ ప్రకృతి ఎంతో ఆహ్లాదకరంగా వున్నది. అద్భుతమైన సెలయేళ్ళు, పచ్చని చెట్లు, నిరుతుని కట్టి పడేసింది. ఆహా! ఎంత దివ్యంగా వున్నది ఈ ప్రకృతి అనుకుంటూ ముందుకు సాగాడు. దూరంగా ధగ ధగమని

బంగారు కాంతులతో మెరిసిపోతున్న కొండ కనిపించింది. సమీపిస్తున్న కొద్ది మరింత తేజస్సుతో కనిపించసాగింది. ఆ కొండ చుట్టూ అద్భుతమైన కాంతి వలయాలు కనిపిస్తున్నాయి. ఆ కొండ గల ప్రదేశంపై ఆకాశంలో సర్వదేవతా సమూహము కనిపిస్తున్నది. ఆహా! ఈ కొండయే తప్పక వేంకటాద్రి అయి వుంటుందనటంలో ఏ మాత్రం సందేహం లేదు అని తలుస్తూ సమీపానికి వచ్చి ఆ కొండపై పాదాన్ని మోపాడు. ఒక్కసారి శరీరమంతా ఎంతో తేలికగా, దివ్య అనుభూతులకు లోనైనట్లు అనిపించింది. ఆశ్చర్యం! పద్నాలుగు లోకాలలో ఎక్కడ నాకు ఈవిధమైన దివ్య అనుభూతి కలగలేదే? ఎంత మధురంగా నున్నది ఈ అనుభూతి అని తలచాడు. ఈ కొండ సామాన్యమైనది కాదు సుమా. దీనిపై కొలువున్నది ఒక్క దేవత కాదు. బహుశా! సమస్త దేవగణమూ ఈ కొండపైననే కొలువుండినారేమో, లేకపోతే ఇంతటి దివ్యానుభూతియా? సమస్త దేవతాగణమూ సంచరించే దివ్య ప్రదేశము ఇదియే కాబోలు. అందువలననే శ్రీమన్నారాయణులవారు ప్రత్యేకముగా ఈ వేంకటాద్రిని దర్శించమని చెప్పాడు అని తలుస్తూ భక్తులతో కలిసి దివ్య రూపంలో కొండను ఎక్కసాగాడు. కొండనెక్కుతున్న భక్తుల ముఖాలలో సంతోషాన్ని చూసి వారి భక్తి పారవశ్యానికి ఆశ్చర్యపడ్డాడు. కొండపైనున్న స్వామిపై వీరికి ఎంతటి విశ్వాసం కలదో వీరి ముఖాలను చూస్తే తెలుస్తుంది. తమ సర్వస్వం ఆ స్వామియే అని తలుస్తూ కొండనెక్కుతున్న వారందరినీ చూసి మురిసిపోయాడు. వారితో కలిసి కొండపైకి చేరాడు.

ఆలయం దగ్గరకు వస్తున్న కొద్దీ ఇక్కడి కొలువున్న స్వామి ఎవరై వుంటారా అనే ఆత్రుత ఎక్కువ కాసాగింది. త్రిమూర్తులలో ఒక్కరా లేక త్రిశక్తులలో ఒకరా అని తలుస్తూ గర్భాలయం వద్దకు వచ్చాడు. కనులు మూసుకుని శ్రీమన్నారాయణులవారికి మనస్సులో ప్రార్థించి కనులు తెరిచాడు. అంతే ఎదురుగా వున్న మూలమూర్తిని చూసి ఆశ్చర్యపోయాడు.

దివ్య మంగళ రూపంతో ప్రకాశిస్తున్న ఆ మూర్తిని చూసిన నిరుతికి నోట మాట రాలేదు. నిరుతికి దర్శనమిచ్చినది దివ్యాభరణభూషితుడై, పట్టు పీతాంబరాలతో శంఖ చక్రములతో వెలుగుతున్న సాక్షాత్ శ్రీమన్నారాయణుడే. ఆహా! స్వామీ! నీవేనా ఇక్కడ కొలువై వున్నది. ఈ మాట చెప్పకుండా మమ్ములనే స్వయంగా వచ్చి తెలుసుకొన్నమన్నావు, నీకివే నా నమస్కారములు. ఓ పరంధామా! ఓ పరమపురుషా! నీకివే నా ప్రణామములు. పరబ్రహ్మమూర్తివి, సమస్త ప్రాణికోటికి ఆధారభూతుడవు, సర్వ దేవతా స్వరూపుడవు, కాలపురుషుడవు, సర్వ వేదాల సారము, సర్వాంతర్యామివి అయిన నీకివే నా నమస్కారములు అని స్వామిని ఎన్నో విధాల ప్రార్థించి నిరుతి తిరిగి తన లోకానికి పయనమైనాడు.

నిరుతి వెళ్ళిన కొన్ని రోజులకు నవగ్రహ దేవతలలో మొదటివాడైన సూర్యదేవుడు శ్రీమన్నారాయణులవారు సెలవిచ్చిన ప్రకారం వేంకటాద్రిని దర్శించుకునే ఉద్దేశ్యంతో భూలోకానికి బయలుదేరి సువర్ణముఖీ నదీ తీరానికి చేరుకున్నాడు. సమీపాన వున్న కొండలను చూస్తూ ముందుకు నడుస్తున్నాడు. అసలీ వేంకటాద్రిపై వెలసిన దైవం ఎవరై వుంటారో! ఈ భూలోకంలో ఎన్నో పుణ్యక్షేత్రములున్నవి. ఇందులో కొన్ని భగవంతుని స్వయంవ్యక్త క్షేత్రములు. కొన్ని దేవతలచే ప్రతిష్ఠింపబడిన దైవ మూర్తులు కల పుణ్యక్షేత్రములు, మరికొన్ని యోగులతోడను, మునీశ్వరుల తోడను ప్రతిష్ఠింపబడినవి. మరికొన్ని మానవులచే ప్రతిష్ఠింపబడినవి. ఇలా ఎన్నో క్షేత్రములు ఈ భూలోకంలో వున్నవి. ఇన్ని దివ్యక్షేత్రాలు వుండగా భూకంలో మానవుల కోటి జన్మల పాపాలను హరించే మహా మహిమాన్విత క్షేత్రంగా వీటన్నింటలో వేంకటాద్రిని శ్రీమన్నారాయణులవారు చెప్పియున్నారు. సాక్షాత్తూ శ్రీ స్వామివారే ఆ విధంగా సెలవిచ్చినారంటే ఈ వేంకటాద్రి ఈ విశ్వంలోనే మహా మహిమాన్విత క్షేత్రమై వుంటుం దనటంలో ఏ మాత్రం సందేహం లేదు. ఇంతకీ ఈ క్షేత్రంపై కొలువున్న

మూర్తి ఎవ్వరా అని సూర్యునికి ఆసక్తి కలిగింది. సృష్టికర్తయైన చతుర్ముఖ బ్రహ్మ కొలువున్న ప్రదేశమా ఇది? లేక సాక్షాత్ శ్రీమన్నారాయణులవారే ఈ కొండపై వున్న ఆలయంలో కొలువున్నారా? లేక ఆ పరమేశ్వరుడే మూలమూర్తిగా కొలువున్నాడా? అని ఈవిధంగా తలుస్తూ వేంకటాద్రి సమీపానికి చేరుకున్నాడు.

దివ్య రూపంలో వున్న ఆదిత్యుడు భక్తులతో కలిసి కొండనెక్కడం ప్రారంభించాడు. సాక్షాత్తూ సూర్యనారాయణుడే వారితోపాటు కలిసి ఎక్కుతుండటం వలన ఆ భక్తులందరూ ఎంతో దివ్యానుభూతులకు లోనౌతున్నారు. వారందరూ ఇదే చర్చించుకుంటున్నారు. ఆహా! ఏమి ఈ విశేషం? ఎందుకు మన శరీరాలన్నీ ఒక్కసారిగా ఎంతో శక్తివంతంగా అనిపిస్తున్నాయి? ఒక్క క్షణం క్రితం లేని దివ్యానుభూతి ఒక్కసారిగా ఎందుకు కలుగుతున్నది? కొండనెక్కుతుంటే శక్తి తగ్గవలసింది పోయి ఇంకా ఎక్కువ అవుతున్నట్టు తోచుచున్నది. వారిలో అనారోగ్యంతో వున్నవారి శరీరం పూర్తి స్వస్థత చేకూరి ఎంతో హాయిగా వున్నది. ఆరోగ్యాన్ని ప్రసాదించే సాక్షాత్ భాస్కరుడే వారి వెంట నడుస్తున్నప్పుడు ఇక వారికి కావలసిందేమిటి?

ఆదిత్యుడు అలా కొండనెక్కుతూ మానవులకు కనపడకుండా దివ్య రూపాలలో సంచరిస్తున్న ఎంతోమంది మహా పురుషులను ఆ కొండపై చూశాడు. ఒకచోట తపస్సు చేసుకుంటున్న చిరంజీవి మార్కండేయుడు కనబడ్డాడు. మరొకచోట ఒక వృక్ష రూపంలో ధ్యానంలో వున్న సాక్షాత్తూ వ్యాసభగవానుడు దర్శనమిచ్చాడు. మరొకచోట మహా శక్తిశాలి అయిన పరశురాముడు దర్శనమిచ్చాడు. పైన చెట్లపై పక్షుల రూపంలో వున్న కొందరు గంధర్వులను గమనించాడు. ఆహా! ఇందరు మహానుభావులు సంచరిస్తున్న ఈ వేంకటాద్రి సామాన్య కొండ కాదు సుమా! ఇది ఎంతో మహిమ కలది కాకపోతే వీరందరూ ఈ ప్రదేశంలో దర్శనమీయడం

అసాధ్యం. కొండపై కొలువున్న దేవత ఎవరో కానీ ఆ పరబ్రహ్మమూర్తి అతడే కావచ్చును. సర్వ క్షేత్ర దర్శన ఫలము ఈ ఒక్క క్షేత్ర దర్శనము చేతనే కలుగునట్లు తోచుచున్నది. ఇంతటి దివ్య క్షేత్రము గురించి మున్నెన్నడూ విని వుండలేదే అని తలుస్తూ కొండనెక్కుతున్న భాస్కరునికి పక్కన అడవిలో దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న ఒక అశ్వరాజం కనిపించింది. ఆహా! ఏమి తేజస్సు! ఈ అశ్వం ఇంతటి తేజస్సుతో మెరిసిపోతున్నదేమిటి? ఇది సామాన్య అశ్వంలా లేదు! ఈ కొండపై వుండుట వలన ఇంత దివ్యంగా ప్రకాశిస్తున్నదా? ఆ అశ్వం వంక చూస్తున్న భాస్కరుడు ఆ దివ్య తేజస్సుకు కనులు పక్కకి తిప్పుకొనలేక పోయాడు. ఇంద్రుని ఉచ్ఛైశ్రవము కంటే వేయి రెట్లు ప్రకాశవంతంగా వున్నది. సూర్యదేవుడు ఇలా తలుస్తుండగానే ఆ అశ్వరాజం వాయువేగంతో మాయమైంది. ఆహా! ఎంత దివ్యంగా వున్నది ఈ అశ్వం? మరొక్కమారు కనిపిస్తే బాగుండును అని తలచాడు.

భక్తులతో కలిసి కొండనెక్కిన సూర్యదేవుడు ఆలయంలోనికి ప్రవేశించాడు. గర్భాలయం దగ్గరకు వస్తున్న కొద్దీ ఆతృత ఎక్కువ కాసాగింది. ఇక్కడి దైవం ఎవరై వుంటారా అని తలుస్తూ గర్భాలయం వద్దకు చేరుకున్నాడు. ఒక్కసారి కనులు మూసుకుని శ్రీమన్నారాయణులవారికి మనస్సులో ప్రార్థించి తిరిగి కనులు తెరిచాడు. అంతే ఎదురుగా దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న మూర్తిని చూసి ఆశ్చర్యపోయాడు. అక్కడ కొలువున్నది సర్వ విద్యలకూ అధిపతి అయిన శ్రీ హయగ్రీవుడు. ఆహా! హయగ్రీవా! ఎంతటి తేజస్సు స్వామీ! నీకివే నా నమస్కారములు. దివ్య మంగళ స్వరూపా నీకివే నా ప్రణామములు అని ఎన్నో విధాల స్తుతించి తిరిగి తన లోకానికి పయనమైనాడు.

ఆదిత్యుడు వెళ్ళిన కొన్ని రోజులకు శశాంకుడు వేంకటాద్రి దర్శనార్థమై భూలోకానికి పయనమైనాడు. సువర్ణముఖీ నదీతీరానికి చేరుకుని

ముందుకు సాగి వేంకటాద్రి చేరుకున్నాడు. విచిత్ర వేషధారణలో వున్న అనేకమంది భక్తులు కొండనెక్కడం చూసి ఆనందించాడు. దట్టమైన అడవి ప్రదేశం గుండా సాగుతున్న ఈ కాలిబాట ఎంతో కష్టతరంగా వున్నది. ప్రతీ అడుగుకు కాలిలో ముళ్ళు గుచ్చుకుంటున్నాయి. ఒక్కొక్క చోట రాళ్ళు కూడా పదునుగా వుండి భక్తుల కాళ్ళకు గాయాలవుతున్నాయి. కానీ ఇవేమీ పట్టకుండా శ్రమను ఏమాత్రం తమ ముఖాలలో కనబడ నీయకుండా భజనలు చేస్తూ ఎక్కుతున్న భక్తులను చూస్తే చంద్రునికి వారి అచంచల భక్తి యెడల ఆశ్చర్యం కలిగింది. ఆహా! ఆ స్వామిపై వీరికి ఎంతటి భక్తి, ఎంతటి అనురాగం, అని తలిచాడు శశాంకుడు. కొంత దూరం వెళ్ళిన తరువాత ప్రక్కన చక్కటి సెలయేరు కనిపించింది. కొండనెక్కుతున్న భక్తులలో కొందరు కాసేపు అక్కడే కూర్చుని నీరు త్రాగి దగ్గరలో వున్న చెట్లనుంచి ఫలాలను కోసుకుని కనులకద్దుకుని స్వామి ప్రసాదంగా భావించి, ఆరగిస్తున్నారు. సెలయేటి దగ్గర ప్రకృతి ఎంతో అద్భుతంగా వున్నది. రకరకాల పక్షుల కిలకిలా రావాలతో ఆ ప్రదేశమంతా ఎంతో కమనీయంగా వున్నది.

ఇంతలో దూరంగా వున్న ఒక చెట్టుపై ఒక పక్షుల జంట చంద్రుని కంటపై పడింది. ఎంత ముచ్చటగా వున్నది ఈ జంట! ఆహా! ఎంత అన్యోన్యంగా కబుర్లు చెప్పుకుంటున్నాయి ఈ జంట అని ఆ పక్షి జంటవైపే తదేకంగా చూస్తున్నాడు శశాంకుడు. అంతే ఒక్కసారి శశాంకునికి దివ్యదృష్టితో ఒక విశేషం బోధపడింది. ఆ పక్షులు సామాన్య పక్షులు కాదు, సాక్షాత్ శ్రీ లక్ష్మీ నారాయణులే! ఓ స్వామీ! ఓ జగన్మాతా! ఎంత చక్కటిదీ దృశ్యం! ఇంతటి అద్భుత దర్శనంతో నేను ధన్యుడనైనాను. ఇలా పక్షుల రూపంలో ఇక్కడే మీరు ముచ్చటగా సంచరిస్తున్నారంటే ఈ వేంకటాద్రి ఎంతటి దివ్య ప్రదేశమో కదా. వీరికి ఇంత ఆనందం కలిగిస్తున్న ఈ వేంకటాద్రి సామాన్యమైన కొండ కాదు సుమా అని తలచాడు.

శశాంకుడు ఇలా తలుస్తుండగానే ఆ పక్షులు ఒక్కసారిగా మాయమైనాయి. చంద్రుడు ఒక్కసారి శ్రీ లక్ష్మీనారాయణులకు మనస్సులోనే ప్రార్థించాడు. ఆహా! సాక్షాత్ శ్రీ లక్ష్మీనారాయణులే విహరిస్తున్న ఈ కొండ సామాన్యమైనది కాదు. అలాగే ఈ కొండపై వున్న దేవుడు కూడా సాక్షాత్ ఆ పరబ్రహ్మ మూర్తికి సమానుడే అయి వుంటాడు. లేకపోతే వైకుంఠంలోని ఆ దివ్య దంపతులు ఇక్కడ ఇంత ఆనందంగా సంచరించడమా? ఇంతకీ కొండపై కొలువున్న దేవత ఎవరై వుంటారు? సృష్టికర్త చతుర్ముఖ బ్రహ్మయా? లేక సాక్షాత్ శ్రీమన్నారాయణుడా? లేక పరమేశ్వరుడా? వీరెవరునూ కాక ఏ స్త్రీ దేవతా శక్తియైనా ఇక్కడ కొలువున్నదా? అని తలుస్తూ కొండనెక్కాడు.

భక్తులతో కలిసి కొండనెక్కిన శశాంకుడు ఆలయం వద్దకు చేరుకున్నాడు. ఆ ప్రదేశమంతా దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్నది. ఈ తేజస్సుకు కారణం ఇక్కడ కొలువున్న దైవం యొక్క శక్తిగా గ్రహించాడు. ఈ అద్భుత ప్రదేశంలో కొలువై వున్న దేవత ఎవరా అని ఆతృతతో తలుస్తూ గర్భాలయం వద్దకు చేరుకున్నాడు. ఒక్కసారి కనులు మూసుకుని శ్రీమన్నారాయణులవారిని ప్రార్థించి తిరగి కనులు తెరిచాడు. ఎదురుగా వున్న దివ్య మంగళ మూర్తిని చూసి ఆశ్చర్యపోయాడు, ఆనందపడ్డాడు.

అక్కడ శశాంకునికి దర్శమనిచ్చినది తలపై పింఛము, చేతిలో మురళితో దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న శ్రీకృష్ణ భగవానుడు. ఆహా! ఎంత దివ్యంగా వున్నది ఈ రూపం'. ఎంతటి వారినైనా సమ్మోహన పరిచే అద్భుత సౌందర్యంతో ప్రకాశిస్తున్న శ్రీకృష్ణుని చూసి శశాంకుడు ఎంతో ఆనందించాడు. స్వామికి రెండు చేతులూ జోడించి నమస్కరించాడు. హే గోవిందా! గోవర్ధనగిరిధారీ! నీకివే నా నమస్కారములు. ఈ కొండపై కొలువున్నది నీవా తండ్రీ. హే కృష్ణా! పురుషోత్తమా! నీ దర్శనభాగ్యంచే ఈ జనులందరూ పునీతులౌతున్నారు. ఎన్నో కోట్ల జన్మల పాపాలూ ఈ కొండపై కాలుపెట్టగానే నశిస్తున్నాయి. నిన్ను దర్శించినవారికి సర్వ

సౌభాగ్యములు, సర్వ ఐశ్వర్యములు చేకూరుతాయి. మనసారా నిన్ను సేవించినవారికి మరుజన్మ వుండదు. నీవు కొలువున్న ఈ క్షేత్రం భూమండలంలోకెల్ల మహా మహిమాన్వితమైనది అని స్వామిని అనేక విధాల స్తుతించి తన లోకానికి పయనమైనాడు శశాంకుడు.

శశాంకుడు వెళ్ళిన కొన్ని రోజులకు వేంకటాద్రి దర్శనార్థమై భూలోకాలనికి బయలుదేరాడు కుజుడు. సువర్ణముఖీ నదీతీరాన వున్న వేంకటాద్రి చేరిన కుజుడు ఆ పర్వతవైభవాన్ని చూసి పులకరించిపోయాడు. ఆహా! ఎంత అద్భుతంగా వున్నది ఈ పర్వతం, ఇంతటి దివ్య తేజస్సు గల పర్వతాన్ని దేవలోకాలలో కూడా ఎక్కడా చూసి వుండలేదే. ఆహా! ఇంత దివ్యమైన పర్వతం చెంతలో వున్న ఈ మానవులు ఎంతటి అదృష్టవంతులో కదా అని తలుస్తూ వేంకటాద్రిపై కాలు మోపిన కుజునికి ఒక్కసారిగా శరీరమంతా ఏదో శక్తి ఆవహించినట్లు అనుభూతి కలిగింది. వెంటనే కాలు వెనుకకు తీసుకున్నాడు. ఒక్క క్షణం ఆగి మళ్ళీ పాదం మోపాడు. మరలా అదే అనుభూతి కలిగింది. ఇదేదో మహా మహిమాన్వితమైన పర్వతంగా వున్నదే! అసలిది పర్వతమేనా లేక పర్వతమున వున్న ఏదేని దేవతయా అని తలచి కనులు మూసుకుని శ్రీమన్నారాయణులవారికి మనస్సులో ఇలా ప్రార్థించాడు.

స్వామీ! ఏమిటీ విచిత్రం కాలు మోపగానే ఎందుకీవిధంగా అనిపిస్తుంది. ఈ పర్వత రాజంయొక్క విశిష్టత ఏమిటి? దీనిపై కాలుమోపే శక్తినివ్వవలసింది అని వేడుకున్నాడు. అలా ప్రార్థించిన వెంటనే కుజుని కంటికి ఆ పర్వతం నిజరూప దర్శనం ఇచ్చింది. పర్వత రూపంలో చుట్టుకుని వున్న ఆదిశేషుడు కుజునికి కనిపించాడు. ఆహా! ఆదిశేషా, ఆ వైకుంఠవాసుని ప్రథమ భక్తుడివైన నీవా ఈ రూపంలో వున్నది! అందుకనే కాలు మోపినంతనే అంతటి అద్భుత అనుభూతి కలుగుతున్నది! సాక్షాత్తూ శ్రీమన్నారాయణు లవారికి తల్పమైన నీపై పాదం మోపటం మహా పాపం!

దయచేసి నన్ను క్షమించి నీపై పాదం మోపే శక్తిని నాకు అనుగ్రహించ వలసింది అని వేడుకున్నాడు. మరొకమారు కనులు మూసుకుని ఆదిశేషునికి మనస్సులో నమస్కరించి ఆ పర్వతంపై కాలు మోపాడు. ఆదిశేషులవారి అనుగ్రహంతో ఈసారి ఆ తేజస్సును తట్టుకునే శక్తిని పొందాడు.

భక్తులతో కలిసి దివ్యరూపంలో కొండనెక్కి కుజుడు కొండపైనున్న ఆలయానికి చేరాడు. గర్భాలయం చేరుకుని కనులు మూసుకుని శ్రీమన్నారాయణులవారికి ప్రార్థించి తిరిగి కనులు తెరిచాడు. ఎదురుగా త్రిమూర్తి స్వరూపులైన శ్రీ దత్తాత్రేయులవారు దర్శనమిచ్చారు. వెంటనే రెండు చేతులూ జోడించి స్వామికి నమస్కరించాడు. ఓ త్రిమూర్తి స్వరూపా నీకివే నా నమస్కారములు. ఈ కొండపై కొలువున్నది నీవా తండ్రీ! ఆహా! ఎంత దివ్య మంగళ మనోహరంగా ప్రకాశిస్తున్నావు స్వామీ! నీవిక్కడ కొలువుండటం వలననే ఈ వేంకటాద్రి ఇంతటి దివ్యంగా ప్రకాశిస్తున్నది. నీ అనుగ్రహం కోసమే సర్వ ప్రాణికోటి ఎదురుచూచుచున్నది. జీవుల హృదయాంతరాలలో వున్న అంతర్యామి స్వరూపం నీవే కదా తండ్రీ. అని ఎన్నో విధాల స్తుతించి తిరిగి తన లోకానికి పయనమైనాడు.

కుజుడు వెళ్ళిన కొన్నిరోజులకు శ్రీమన్నారాయణులవారి ఆదేశం ప్రకారం వేంకటాద్రి దర్శనార్థమై బుధుడు భూలోకానికి బయలుదేరాడు. సువర్ణముఖీ నదీతీరం చేరి ముందుకు సాగి వేంకటాద్రి వద్దకు చేరుకున్నాడు. ఆ దివ్య పర్వతరాజంపై కాలు పెట్టగానే బుధుని శరీరమంతా దివ్య తేజస్సు ప్రవహించింది. ఆహా! ఏమి దివ్యానుభూతి, ఈ కొండ సామాన్యమైనది కాదు సుమా. ఎంతో మహిమాన్వితమైనదిగా తోచుచున్నది అని తలుస్తూ కొండనెక్కసాగాడు.

దివ్యరూపంలో కొండనెక్కుతున్న బుధుని ఎవ్వరూ గమనించటలేదు. భజనలు చేసుకుంటూ కొండనెక్కుతున్న భక్తులను చూసి బుధుడు ఎంతో

మురిసిపోయాడు. దారిలో ఎంతో అద్భుతంగా వున్న ప్రకృతిని చూసి పులకరించిపోయాడు. దారికిరువైపులా వున్న పూలమొక్కలలో కొన్ని దేవలోకంలో వుండేవిగా గమనించాడు. దేవలోకాలలో తప్ప మరెక్కడా కనపడని ఈ పూలమొక్కలు, దివ్య వృక్షాలు ఇక్కడ వున్నాయంటే ఈ వేంకటాద్రి సామాన్యమైన పర్వతం కాదు సుమా అని తలచాడు. ఇలా ఈ వేంకటాద్రి దివ్య వైభవం గురించి తలుస్తూ కొండనెక్కుతున్న బుధునికి సమీపంలోని చెట్లపై అనేక వానరాలు కనిపించాయి. ఒక చెట్టుపై నుంచి మరో చెట్టుపైకి ఎగురుతున్న ఆ వానరాలను చూసిన బుధునికి ఎంతో ముచ్చట వేసింది. ఇంతలో ఆ వానర గుంపులో ఒక వానరం మాత్రం ఎంతో దివ్య తేజస్సుతో మెరిసిపోతూ కనిపించింది. మిగిలినవాటి లాగా అటూ ఇటూ దూకకుండా ఒక చెట్టుపై కూర్చుని వున్న ఈ వానరం సామాన్య వానరంలాగా కనిపించుట లేదు అని తలచాడు. బుధుడు కనులు మూసుకుని ఒక్కసారి ధ్యానం చేశాడు. అంతే అసలు విషయం గోచరించింది! అంతటి దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న ఆ వానరం సామాన్య వానరం కాదని గమనించాడు. సాక్షాత్తూ పవనకుమారుడైన హనుమంతుడే! ఆహా! స్వామీ! ఆంజనేయా! నీకివే నా నమస్కారములు. నీవిక్కడ సామాన్య వానర రూపంలో సంచరిస్తున్నావంటే ఈ వేంకటాద్రి సామాన్యమైనది కాదు. అలాగే దీనిపై కొలువున్న దేవుడు కూడా ఎంతో దివ్య శక్తి సంపన్నుడై వుంటాడనటంలో సందేహం లేదు అని తలుస్తూ ఆంజనేయునికి నమస్కరించి ముందుకు సాగాడు.

ఇంతకీ ఆ కొండపై కొలువున్న దేవత ఎవరై వుంటారు? సాక్షాత్తూ ఆంజనేయులవారే ఇక్కడ ఆనందంగా సంచరిస్తున్నారంటే కొండపై కొలువున్నది శ్రీరామచంద్రుడా? లేక హనుమంతులవారు శివాంశ సంభూతుడగుటచేత సాక్షాత్తూ మహేశ్వరుడే కొండపై కొలువున్నాడా అని ఈవిధంగా తలుస్తూ కొండనెక్కుతున్న బుధునికి ఆకాశంలో ఒక అద్భుత

దృశ్యం కనిపించింది. ఓంకార రూపం స్పష్టంగా దర్శనమిచ్చింది. ఆహా! సాక్షాత్తూ ప్రణవరూపమే దర్శనమిచ్చిన ఈ ప్రదేశం మహా మహిమాన్వితమైన దనటంలో ఏ మాత్రం సందేహం లేదు. సృష్టికి మూలమైన ప్రణవ స్వరూపం దర్శనమిచ్చిన ఈ ప్రదేశం తప్పక సృష్టి మొత్తానికి ఆదియై వుండి వుంటుంది అని తలచాడు.

వేంకటాద్రి విశిష్టతను గురించి తలుస్తూ కొండనెక్కిన బుధుడు ఆలయం వద్దకు చేరుకున్నాడు. ఆ ప్రదేశమంతా దివ్య తేజస్సుతో నిండి వుండటం గమనించాడు. అక్కడ వున్న భక్తులందరి ముఖాలలో ఎంతో ఆనందాన్ని చూశాడు. ఆహా! వీరికి ఈ స్వామిపై ఎంతటి భక్తి! ఎంతటి తాదాత్మ్యత! ఎంతటి అనురాగం! ఈ స్వామినే సర్వస్వంగా భావిస్తున్న వీరి భక్తి అనన్యమైనది, అసమానమైనది అని తలుస్తూ గర్భాలయం వద్దకు చేరుకున్నాడు. ఒక్కసారి కనులు మూసుకుని శ్రీమన్నారాయణులవారిని ప్రార్థించి కనులు తెరిచాడు. ఎదురుగా సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే కనిపించాడు. ఆహా! ఎంతటి దివ్య మంగళ స్వరూపం! ఓ జగన్నాథా! జగద్రక్షకా! పరంధామా! పరమపురుషా! నీవా ఇక్కడ కొలువున్నది! సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపమైన నీవే ఇక్కడ కొలువుండుటచేత ఈ ప్రదేశమంతయూ దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్నది. ఓ పరంధామా! సర్వాంతర్యామివైన నీకివే నా నమస్కారములు. సమస్త జీవుల హృదయాలలో వున్న పరబ్రహ్మమూర్తివి నీవే తండ్రీ. పంచభూతాలు, సూర్యచంద్రులు, భూత భవిష్యత్ వర్తమాన కాలాలు, సమస్త జీవకోటి నీ స్వరూపమే కదా తండ్రీ. నిన్ను కొలిచిన వారికి సర్వం అనుగ్రహించే అమృతమూర్తివి నీవే తండ్రీ. నీవే సర్వజ్ఞుడవు. సర్వాధారానివి నీవే. విద్యా ధారకుడవు. విద్యాతీతుడవు నీవే. నీవే మోక్షము, మోక్ష సాధనము కూడా నీవే తండ్రీ. ఈ విశ్వమంతా వ్యాపించి వున్న శ్రీమన్నారాయణా! నీకివే నా నమస్కారములు అని అనేకవిధాల స్తుతించి తిరిగి తన లోకానికి పయనమైనాడు.

బుధుడు వెళ్లిన కొన్ని రోజులకు గురుడు శ్రీమన్నారాయణులవారి ఆదేశం ప్రకారం భూలోకానికి చేరి సువర్ణముఖీ నదీతీరంలో వున్న వేంకటాద్రి వద్దకు వచ్చాడు. బృహస్పతి అక్కడవున్న భక్తులతో కలిసి కొండనెక్కి అక్కడ గర్భాలయంలో కొలువై వున్న స్వామిని దర్శించుకున్నాడు. బృహస్పతికి ఆలయంలో మూలమూర్తిగా కొలువున్న మహేశ్వరుడు దర్శనమిచ్చాడు. ఆ పరమేశ్వరునికి నమస్కరించి అక్కడ వున్నది సాక్షాత్తూ నీలకంఠునిగా గ్రహించి తిరిగి తన లోకానికి పయనమైనాడు. అటు పిమ్మట కొన్ని రోజులకు శుక్రుడు వేంకటాద్రి చేరి భక్తులతో కలసి దివ్య రూపంలో కొండనెక్కి ఆలయానికి చేరుకున్నాడు. కొండపై కొలువున్న స్వామి ఎవరై వుంటారా అని తలుస్తూ గర్భాలయం చేరుకున్న శుక్రునికి అక్కడ దివ్య మంగళ రూపంలో ప్రకాశిస్తున్న జగన్మాత దుర్గాదేవి దర్శనమిచ్చింది. అమ్మకు నమస్కరించి అనేక విధాల స్తుతించి కొండపై కొలువున్నది సాక్షాత్తూ ఆ పరమేశ్వరియే అని గ్రహించి తిరిగి తన లోకానికి పయనమైనాడు శుక్రుడు. శుక్రుడు వెళ్ళిన కొన్ని రోజులకు శనేశ్వరుడు శ్రీమన్నారాయణులవారి ఆదేశం ప్రకారం భూలోకం చేరి వేంకటాద్రి వద్దకు వచ్చి భక్తులతో కలసి కొండనెక్కాడు. ఆ భక్తులందరి ముఖాలలో ఆనందం చూసి ఆహా! ఈ స్వామిపై వీరికి ఎంతటి భక్తియో కదా అని తలచాడు. వారితో కలిసి కొండనెక్కి ఆలయంలో ప్రవేశించాడు. గర్భాలయంలో కొలువున్న మూలమూర్తి ఎవరై వుంటారా అనుకుని ఆతృతతో అక్కడకు చేరిన శనేశ్వరునికి అక్కడ సాక్షాత్తూ వైకుంఠవాసుడైన శ్రీమన్నారాయణుల వారు విగ్రహరూపంలో దర్శనమిచ్చారు. కొండపై కొలువున్నది సాక్షాత్తూ పరబ్రహ్మ మూర్తియైన ఆ మహావిష్ణువే అని గ్రహించి స్వామివారికి నమస్కరించి అనేక విధాల స్తుతించి తిరిగి తన లోకానికి పయనమైనాడు శనేశ్వరుడు.

శనేశ్వరుడు వెళ్ళిన కొన్ని రోజులకు వేంకటాద్రికి వచ్చిన రాహువుకు అక్కడ ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరుడు దర్శనమిచ్చాడు. అటు తరువాత వచ్చిన కేతువుకు గర్భాలయంలో పరమేశ్వరుడు మూలమూర్తిగా దర్శనమిచ్చాడు.

ఈ విధంగా శ్రీమన్నారాయణుని ఆదేశం ప్రకారం వేంకటాద్రిని దర్శించిన అష్ట దిక్పాలకులు, నవగ్రహ దేవతలు ఒకనాడు వైకుంఠం చేరి శ్రీమన్నారాయణులవారి వద్దకు తాము దర్శించిన విశేషాలను వివరించడానికి వచ్చారు. వీరందరూ శ్రీమన్నారాయణులవద్దకు వచ్చేసరికి అక్కడ నారదులవారు కనిపించారు. ఇలా అందరు దేవతలూ ఒక్కసారిగా రావటం చూసిన నారదులవారు ఆశ్చర్యపోయారు. వారిని ఉద్దేశించి ఇలా అన్నారు. ఆహా! ఏమి విశేషం? అష్ట దిక్పాలకులు, నవగ్రహ దేవతలు అయిన మీరందరూ ఒకేసారి శ్రీమన్నారాయణులవారి దర్శనార్థమై వచ్చారంటే సామాన్య విషయం కాదు సుమా! ఇందులో ఏదో మహత్తర విశేషమే ఉండి వుంటుంది అని అన్నాడు. అప్పుడు ఇంద్రుడు నారదునితో 'ఓ మునీశ్వరా! నీకివే మా నమస్కారములు. భూలోకంలో మానవులు తమ తమ పూర్వజన్మ కర్మ ఫలంచేత అనేక పాపకర్మలను అనుభవిస్తూ ఎన్నోకష్టాలపాలవుతున్నారు. వారి పాపాల నివృత్తి ఏ విధంగా కాగలదని మేమందరమూ శ్రీమన్నారాయణులవారిని ప్రార్థించగా భూలోకంలో వేంకటాద్రి అనే పుణ్యక్షేత్రం కలదని, ఆ క్షేత్ర దర్శనం చేసి అక్కడ వున్న స్వామిన సేవించిన మానవుల కోటి జన్మల పాపాలు కూడా హరించగలవని స్వామి శెలవిచ్చాడు. అక్కడ కొలువై వున్న దైవము ఎవ్వరో మమ్ములనే వెళ్ళి తెలుసుకొనమన్నారు. ఆ స్వామి ఆదేశంతో ఆ దివ్యక్షేత్రాన్ని మేమందరమూ దర్శించాము. ఆ విశేషాలను స్వామికి విన్నవించడానికై తాము అందరమూ వచ్చితిమి అని అన్నాడు.

అప్పుడు శ్రీమన్నారాయణులవారు అక్కడకు వచ్చిన దేవతలందరితో ఇలా అన్నారు. 'ఓ అష్ట దిక్పాలకులారా! నవగ్రహదేవతలారా! మీ భూలోక యాత్ర సుఖముగా జరిగినది కదా. మీరు వేంకటాద్రికి వెళ్ళి అక్కడ ఏమి దర్శించినారో ఆ విశేషములన్నీ తెలుపవలసింది అని అన్నాడు. అప్పుడు ఇంద్రుడు స్వామీ! శ్రీమన్నారాయణా నీకివే మా అందరి నమస్కారములు. నీ అనుగ్రహంచేత నేను భూలోకమునకు వెళ్ళి వేంకటాద్రి దర్శించినాను. ఆ క్షేత్రము ఎంతో మహా మహిమాన్వితమైనదిగా గ్రహించాను. అక్కడ కొండపై ఆలయంలో కొలువున్న జగన్మాత దుర్గమ్మ తల్లిని దర్శించాను. దివ్య మంగళ స్వరూపంలో ప్రకాశిస్తున్న ఆ తల్లి దర్శనం నాకెంతో ఆనందమయమైనది అని అన్నాడు.

అప్పుడు శ్రీమన్నారాయణులవారు వరుణదేవునితో 'ఓ వరుణదేవా! నీ భూలోకయాత్ర ఏవిధంగా జరిగింది. వేంకటాద్రిని దర్శించితివా అని అడిగాడు. అప్పుడు వరుణదేవుడు స్వామీ! జగన్నాథా, జగద్రక్షకా నీ అనుగ్రహం చేత నా భూలోక యాత్ర అద్భుతంగా జరిగినది. వేంకటాద్రి ఎంతో దివ్య ప్రదేశం. మిక్కిలి ప్రకాశవంతమై వెలుగొందుతున్న దివ్య క్షేత్రము. ఆ కొండనెక్కి పైన ఆలయంలో వున్న కార్తికేయుని దర్శించినాను. ఆహా! ఎంత అద్భుతమని చెప్పుదును ఆ వేంకటాద్రి మహిమలను? ఆ దివ్య క్షేత్రం విశేషాలను వర్ణించటం నాతరం కాదు అని అన్నాడు. అటుపిమ్మట యమధర్మరాజు శ్రీమన్నారాయణుల వారితో 'స్వామీ నీ అనుగ్రహం చేత వేంకటాద్రికి వెళ్ళి అందున్న శ్రీ మహాలక్ష్మిని దర్శించితిని. ఆ జగన్మాత దర్శనంతో నేను ధన్యుడనైతిని. సర్వ ఐశ్వర్య ప్రదాయినియై ఆ తల్లి భక్తులను ఎంతగానో అలరిస్తున్నది' అని అన్నాడు.

ఈ ముగ్గురూ ఇలా చెప్పగానే అక్కడవున్న దేవతలందరికీ ఆశ్చర్యం కలిగింది. ఇదెలా సాధ్యం? తామందరమూ వెళ్ళినది వేంకటాద్రియే కదా! ఒకే దేవాలయంలో ఇలా విభిన్న మూర్తులు దర్శనమీయడమా?

ఒకే ప్రదేశంలో కొలువై వున్న దైవము ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా కనిపించుటయా అని తలుస్తుండగా అగ్నిదేవుడు శ్రీమన్నారాయణులవారితో వేంకటాద్రిపై గల ఆలయంలో తనకు సాక్షాత్తూ మహేశ్వరుడు దర్శనమిచ్చాడని చెప్పాడు. అటు తరువాత వాయుదేవుడు శ్రీ స్వామివారితో ఓ స్వామీ! జగన్నాథా! జగద్రక్షకా నీకివే నా నమస్కారములు. నీ అనుగ్రహంచేత నా భూలోకయాత్ర ఎంతో అద్భుతంగా జరిగినది. వేంకటాద్రి చేరి అక్కడ ఆలయంలో వున్న తల్లి సరస్వతీ మాతను దర్శించినాను. సమస్త విద్యలకూ ఆధారభూతురాలైన ఆ తల్లి తన దివ్య దర్శనంతో అనుగ్రహించినది అని అన్నాడు.

వాయుదేవుని ఈ మాటలకు దేవతలందరూ మరింత ఆశ్చర్యపోయారు. ఆలయంలో సరస్వతీదేవి దర్శనమివ్వడమా? ఆహా! ఇది ఏవిధంగా సాధ్యం? అని తలుస్తుండగా కుబేరులవారు వైకుంఠవాసునితో ఇలా అన్నారు. 'ఓ స్వామీ! జగన్నాథా! జగత్ప్రభూ! నీకివే నా ప్రణామములు. నీ అనుగ్రహం చేత నా భూలోకయాత్ర దిగ్విజయంగా జరిగినది. అక్కడ కొండపై దేవాలయంలో నీ దివ్య మంగళ మనోహర విగ్రహాన్నే నేను దర్శించితిని, నీ దివ్య దర్శనంతో నన్ను అనుగ్రహించినందుకు కృతజ్ఞుడను తండ్రీ అని అన్నాడు.

అటు తరువాత ఈశానుడు తనకు ఆ ఆలయంలో సాక్షాత్తూ శ్రీ నారసింహులవారు దర్శనమిచ్చారని చెప్పాడు. అప్పుడు శ్రీమన్నారాయణులవారు నిరుతిని ఉద్దేశించి తనకు ఎవరు దర్శనమిచ్చారని అన్నాడు. నిరుతి అందుకు సమాధానంగా ఓ స్వామీ! శ్రీమన్నారాయణా! మీ అనుగ్రహంచేత నా భూలోకయాత్ర ఎంతో జయప్రదంగా జరిగింది. అక్కడ ఆలయంలో దివ్య తేజస్సుతో ప్రకాశిస్తూ భక్తుల పూజలందుకుంటూ వారందరినీ అనుగ్రహిస్తున్న నీ దివ్య రూపమే నాకు దర్శనమిచ్చింది.

వేంకటాద్రిపై గల ఆలయంలో నీ దివ్యమంగళ మనోహర మూర్తి దర్శనభాగ్యం కలిగింది అని అన్నాడు.

అప్పుడు శ్రీమన్నారాయణులవారు చిరునవ్వు నవ్వుతూ నవగ్రహ దేవతల వంక చూశారు. ఆదిత్యుడు శ్రీమన్నారాయణునికి నమస్కరించి ఇలా అన్నాడు. 'ఓ స్వామీ పరంధామా! పరమపురుషా! నీకివే నా ప్రణామములు. మీ అనుగ్రహంతో నా భూలోకయాత్ర ఎంతో దివ్యంగా జరిగింది. అక్కడ వేంకటాద్రిపైగల ఆలయంలో సాక్షాత్తూ నాకు సర్వ విద్యలకూ అధిపతియైన హయగ్రీవమూర్తి దర్శనమిచ్చాడు. ఆ స్వామి దర్శనభాగ్యంతో నేను ధన్యుడనైనాను అని అన్నాడు. ఆ తరువాత చంద్రుడు శ్రీ స్వామివారితో తనకు వేంకటాద్రిపై గల ఆలయంలో దివ్య మనోహర రూపంలో శ్రీకృష్ణులవారు దర్శనమిచ్చారని చెప్పాడు. ఈ విధంగా నవగ్రహ దేవతలలోని మిగిలినవారందరూ కూడా వేంకటాద్రిపై తాము దర్శించిన దేవతామూర్తుల గురించి శ్రీమన్నారాయణులవారికి వివరించి చెప్పారు.

అక్కడ వున్న దేవతలందరూ ఈ విషయం ఎంతో ఆసక్తిగా చర్చించుకొనసాగారు. ఒకే ప్రదేశంలో ఒక్కొక్క దేవత దర్శనమీయ డమేమిటి, ఒకే ఆలయానికి దర్శనానికి వచ్చిన తమకు గర్భాలయంలో వివిధ మూర్తుల దర్శనమీయడం చాలా ఆశ్చర్యం కలిగించింది. అప్పుడు ఇంద్రుడు శ్రీమన్నారాయణులవారికి నమస్కరించి ఇలా అన్నాడు. ఓ స్వామీ! జగన్నాథా! జగద్రక్షకా! నీకివే నా ప్రణామములు. నీవు త్రిగుణాత్మకుడవు. త్రికాల రూపుడవు. పాప హరుడవు. సమస్త జీవకోటి హృదయాంతరాలలో అంతర్యామి స్వరూపంలో ప్రకాశిస్తున్నది నీవే కదా తండ్రీ. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు సర్వం చదివినా నీ గురించి సహస్రపు వంతు కూడా తెలుసుకొనలేము. కేవలం నీ నామ సంకీర్తనం చేతనే మేమందరమూ మా మా శక్తులు పొందగలుగుతున్నాము.

సర్వ ప్రాణికోటికి నీ నామస్మరణయే ఆధారము. నీ లీలలను తెలుసుకొనుట చాలా దుర్లభము. మేమందరమూ నీ అనుగ్రహంతో వేంకటాద్రి చేరి నీవు ఆదేశించినట్లుగా అక్కడ కొండపై వున్న ఆలయమునకు చేరి అందున్న దేవతను దర్శించితిమి. కానీ ఒకే ఆలయంలో మా అందరికి వేరు వేరు దేవతా స్వరూపముల దర్శనం కలిగినది. ఇదెలా సాధ్యం తండ్రీ? దయచేసి ఈ విశేషమును వివరంగా తెలిపి మమ్ములను అనుగ్రహింపవలసింది అని ప్రార్థించాడు.

అప్పుడు శ్రీమన్నారాయణులవారు ఇంద్రాది అష్ట దిక్పాలకులను, ఆదిత్యాది నవగ్రహాలనూ ఉద్దేశించి ఇలా అన్నారు. 'ఓ దేవతలారా! నేను ఇప్పుడు చెప్పే విషయం చాలా సావధానంగా వినండి. నేనెవరో నా తత్వమేమిటో మీకు వివరముగా అర్థం కాగలదు. మీకు వేంకటాద్రిపై ఒకే ఆలయంలో వివిధ దేవతా మూర్తులు ఎందుకు దర్శనమిచ్చినారో కూడా విశదము కాగలదు, శ్రద్ధగా వినవలసింది. ఈ సృష్టి మొత్తం వ్యాపించి యున్నది నా రూపమే. ఈ సృష్టియందలి ప్రతి అణువుయందు నేను వ్యాపించి వున్నాను. ఈ సృష్టిలోని సమస్త జీవకోటి హృదయాలలో అంతర్యామి స్వరూపంలో వున్నది నేనే. సర్వదేవతలూ నా రూపములే. నేనే వివిధ దేవతా రూపములలో ప్రకటింపబడుతున్నాను. బ్రహ్మ రూపంలో సృష్టికి, విష్ణు రూపంలో స్థితికి, ఈశ్వర రూపంలో లయకు కారణభూతడను నేనే. నా నామసంకీర్తనం వలననే నారదుడు, తుంబురుడు సకల దేవతాగణమూ పునీతులౌతున్నారు. నా నామ సంకీర్తన వలన కలిగెడి ఆనందం యజ్ఞము, తపస్సు, దానము, తీర్థయాత్రల వంటి ఏ కార్యములవలన లభించెడి ఆనందము కంటే వేయి రెట్లుగా గమనించవలసినది. నా స్వరూపము విశ్వమంతయూ వ్యాపించి యున్నది. నా కటి ప్రదేశము నుండి ఊర్ధ్వ దేహమే ఊర్ధ్వ లోకములు. అధో దేహమే అధో లోకాలు, నాభియే భువర్లోకము, హృదయమే సువర్లోకము, మెడ జనలోకము, వక్షమే

మహర్లోకము, స్తన ధ్వయము తపోలోకము, నా శిరస్సే సత్యలోకము. నా జఘనమే అతలము, తొడలు వితలములు, మోకాళ్ళు సుతలము, తలాతలము పిక్కలు, మహాతలము చీలమండలము, నా పాదాగ్రమే రసాతలము. పాదాలే పాతాళము, ముఖము వాక్కు, అగ్ని, రోమాలే ఉష్టిక్ ఛందస్సు, నా చర్మమే ధాత్రీ చంధస్సు, మాంసము త్రిష్టప్ ఛందస్సు, అస్థి జగతీ ఛందస్సు, మక్తి పంక్తి ఛందస్సు, ప్రాణము బృహతీ ఛందస్సు, రసము నాలుక, వాయువు శ్వాస, సూర్యుడు కనులు, దిశలే చెవులు, స్పర్శయే దేహము, మేఘములే నా కేశములు, నా కనురెప్పలే రాత్రింబవళ్ళు, ఈవిధంగా నేను సర్వాంతర్యామిని అని అన్నాడు.

శ్రీమన్నారాయణులవారు ఇంకా ఇలా చెప్పసాగారు. ఈ విశ్వంలో నాకు వేంకటాద్రియన్న ఎంతో ప్రియము. వేంకటాద్రి ఈ సృష్టియందు ఆదినుంచి వున్నది. ఈ సృష్టి మొత్తం ప్రారంభమైనది కూడా వేంకటాద్రి నుండియే అని గ్రహింపవలసింది. ఇప్పటికి ఈ సృష్టి ప్రారంభమై ఎన్నో మహా యుగాలయ్యైనది. ఈ మహా యుగములలో త్రేతాయుగమందు రామునిగాను, ద్వాపరమందు కృష్ణునిగాను, ఇలా ఎన్నో యుగములలో ఎన్నో విధములుగా అవతారములు ధరించి యున్నాను. వేంకటాద్రియందలి ఆనందనిలయంలో నేను ధరించిన అన్ని అవతారములను దర్శించవచ్చును. అక్కడ నన్ను ఏ రూపంలో కొలచినవారికి ఆ రూపంలోనే దర్శనమిచ్చెదను. ఎవరు ఏ దేవతకు నమస్కరించినా, ఎవరు ఏ దేవతను శరణు వేడినా అది నాకే చేరును. భక్తులు ఏ రూపంలో నన్ను కొలచినా నేను వారిని వెంటనే అనుగ్రహించెదను అని అన్నాడు.

శ్రీమన్నారాయణులవారు ఇంకా ఈవిధంగా చెప్పసాగారు. ఓ దేవతలారా! ఈ విశ్వమంతటిలో నాకు వేంకటాద్రి అత్యంత ప్రీతికరమైన ప్రదేశము. ఈ కొండపై కాలు పెట్టినంతటనే అనేక కోట్ల జన్మలలో చేసిన పాపములన్నీ పటాపంచలు కాగలవు. కేవలము వేంకటాద్రిని మనస్సులో

తలచినా వేయి జన్మల పాపములు తక్షణమే నశింపగలవు. ఇంతకు ముందు చెప్పినట్లుగా ఈ వేంకటాద్రి సృష్టి ప్రారంభం నుండి కలదు. ఎన్నో మహా యుగములు సంభవించినను ఈ ప్రదేశమే నాకు అత్యంత ప్రీతికరముగా యున్నది. ఈ జగత్తులో సర్వ జీవకోటి, నేల, నీరు, ఆకాశము, నదులు, సముద్రాలు, కొండలు, లోయలు, ఎడారులు సర్వమూ నా స్వరూపమే. వీటన్నింటియందూ నన్ను దర్శించినవారికి సర్వ సంపదలూ, సర్వ సౌభాగ్యములూ కలుగగలవు. జీవించినంతకాలం సుఖముగా జీవించి చివరన ముక్తిని పొందురు. కాల స్వరూపము నేనే, ప్రతీ క్షణమూ నేనే, ప్రతీ ఘడియ, విఘడియలయందు కూడా నేనే వున్నాను. ఈ సృష్టి సర్వం నేను వ్యాపించి యుండుటచేత ఎక్కడ ఏది జరిగినా, ఆ క్షణంలోనే నాకు తెలియగలదు. భూలోకంనందలి మానవులందరూ అల్పాయుష్కులై అనేక పాపకర్మలనొనరిస్తున్నారు. సుఖములన్నీ శాశ్వతమని భ్రమిస్తున్నారు. అనేకమైన బాధలకు లోనౌతున్నారు. వారి జీవితం శాశ్వతము కాదు. వారికి జరిగే ఏ అనుభవమూ కూడా శాశ్వతము కాదు అని గ్రహించుట లేదు. కాల స్వరూపుడనైన నేను వారి వారి కర్మ ఫలమును బట్టి తదుపరి జన్మలు అనుగ్రహిస్తున్నాను, జీవితకాలమంతయూ ధర్మపథములో నడుస్తూ పుణ్యకార్యములు నొనర్చువారు చివరికి నాలోనే ఐక్యమొంది జన్మ రాహిత్యము పొందగలరు. తన తల్లి, తండ్రీ, చెల్లెలు, అక్క, అన్న తమ్ముడు, తన బంధువులు, తన శత్రువులు, ఇలా అందరిలోనూ నా స్వరూపమే దర్శించిన వారికి సర్వమూ అర్థము కాగలదు. ఎవరైతే ఎల్లవేళలా నన్నే తలుస్తూ వుంటారో వారి యోగక్షేమములు నేనే వహిస్తాను అని అన్నాడు.

శ్రీమన్నారాయణులవారు ఇంకా ఈవిధంగా చెప్పసాగారు. ఓ దేవతలారా! సర్వదేవతలూ నా స్వరూపములేనని మీరు తెలుసుకొన గలందులకై మిమ్ములను వేంకటాద్రి దర్శించమని చెప్పినాను. ఆలయంలో మీరు దర్శించిన అన్ని రూపములు నావేనని గ్రహించండి. భక్తులందరూ

తాము ఏవిధముగా కొలచినా ఆ రూపంలోనే దర్శనమిచ్చెదను. ఒకే రోజు నేను వివిధ భక్తులకు, వివిధ రూపములలో దర్శనమిచ్చెదను. ఈ విశ్వంలో నాకు వేంకటాద్రి మిక్కిలి ప్రీతికరము. అనేకమంది దేవతలూ, మునులూ యుగయుగాలుగా ఆ కొండపై తపస్సు చేస్తున్నారు. అనేకమంది దేవతలు రోజూ నన్ను దర్శనం చేసుకొనడానికి వేంకటాద్రి వస్తున్నారు. భూలోకంలో మానవులకు వేంకటాద్రిని మించిన దివ్యక్షేత్రం మరొకటి లేదు. ఆ క్షేత్రంలో ఒకరాత్రి నిద్రించినచో భూమండలంలోని అన్ని క్షేత్రములలో నిద్రించిన ఫలం కలుగగలదు. వేంకటాద్రిపై చేసిన ఏ దానమైననూ కోటిరెట్లు అధిక ఫలమీయగలదు. ఆ కొండపై నేనును, నా ప్రియ సఖి మహాలక్ష్మియును భక్తులతో కలిసి దివ్య రూపంలో నిత్యమూ సంచరించెదను. ఒక్కోసారి పక్షుల రూపంలో, మరొక సారి మృగముల రూపంలో, మరొకసారి సామాన్య భక్తుల రూపంలో సంచరించెదను. వేంకటాద్రిపై ప్రతీ మొక్క, చెట్టు, రాయి, ఇలా అన్నింటియందునా నా రూపమే దాగి యున్నది అని శెలవిచ్చారు.

అప్పుడు ఆ దేవతలందరూ శ్రీమన్నారాయణులవారికి, శ్రీ మహాలక్ష్మికి నమస్కరించి అనేక విధముల స్తుతించి తమ తమ నిజ స్థానములకు వెడలిరి. నారద మునీంద్రులవారు కూడా శ్రీలక్ష్మీనారాయణులవద్ద శెలవు తీసుకుని లోకసంచారమునకై వెడలిపోయెను.

శ్రియ: కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్తినామ్

శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్





శ్రీ స్వామివారి అనుగ్రహంతో తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి రచించిన ఇతర రచనలు :

1. శ్రీ శ్రీనివాస మాహాత్మ్యము
(తిరుమల శ్రీనివాసుని దివ్యగాధల నిత్యపారాయణ గ్రంధం)

2. శ్రీ వేంకటేశ్వర వ్రత కల్పము
(సాక్షాత్తూ శ్రీ స్వామివారిచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రత కల్పము)

3. అమృత సోపానము
(తిరుమల కాలినడక దివ్యచరిత్ర)

4. శ్రీ వేంకటేశ్వర దర్శనము
(ఇరవై నాలుగు కేశవ నామాల శ్రీ వేంకటేశ్వర దివ్య దర్శనం)

5. యోగక్షేమం వహామ్యహమ్
(శ్రీనివాసుని దివ్యలీలలు)

6. భజే శ్రీనివాసమ్
(ఇరవై ఏడు నక్షత్రాల శ్రీనివాస దివ్య వైభవం)

7. శ్రీ పద్మావతీ పరిణయము
(శ్రీ పద్మావతీ శ్రీనివాసుల దివ్య కళ్యాణ వైభవం)

8. శ్రీ నరసింహ వ్రత కల్పము

9. Sri Srinivasa - Lord of Seven Hills
(Glory of Lord Balaji Sri Venkateswara)

10. Sri Balaji Vrath Kadha
(Hindi translation of Telugu Vrata Kalpam)

*For details contact :*

"Viswapathi", T.V.R.K. MURTHY, M.Tech, Flat No. 202, Plot No. 32, Srikar's Ravi Residency,
Beside Nalanda High School, Near Motinagar 'X' Roads, HYDERABAD-18, India. Ph : 040 - 65885750.
Cell : 98494 43752, Website : www.lordofsevenhills.com Email : viswapathi@yahoo.com